www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 6

Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విశాఖపట్నం

30, 31 తేదీల్లో పనిచేయనున్న రిజిస్ట్రార్ కార్యాలయాలు

- సెలవు దినాలైనప్పటికీ ఆర్థిక సంవత్సరం ఆఖరు కావడంతో 11 నుంచి 5 గంటల వరకూ సేవలు అందించాలని ప్రభుత్వ నిర్ణయం



విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

ఉగాది (ఆదివారం), రంజాన్ (సోమవారం) పండుగల రోజున కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. మంచి రోజులు, ఆర్థిక సంవత్సరం ఆఖరి రోజులు కావడంతో చాలామంది స్థిరాస్తుల లావాదేవీలు పూర్తిచేసుకునే అవకాశం ఉన్నందున, సెలవులైనప్పటికీ ఆ రెండు రోజుల్లో సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలు ఉదయం ... మిగతా 2వ పేజీలో

స్టీల్‌ప్లాంటులో నేడు కాంట్రాక్టు కార్మికుల సమ్మె

- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌తో సమ్మె
- ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు విఫలం



- కార్మిక సమ్మెలో పాల్గొననున్న 11వేల మంది
- అప్రమత్తమైన ఉక్కు యాజమాన్యం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం సమ్మె చేయనున్నారు. శుక్రవారం ఉదయం 6 నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు (ఏ, బీ, సీ షిఫ్టులు) ఆందోళన కొనసాగించనున్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, తొలగించిన వారిని తిరిగి తీసుకోవాలనే ప్రధాన డిమాండ్‌లతో సుమారు 11 వేల మంది సమ్మెకు దిగుతున్నారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్లాంటులో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తమయ్యారు.

కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు..

- ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని కూడా విధుల నుంచి తొలగించరాదు.
- ఇప్పటికే తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి.
- పాత పద్ధతిలోనే కార్మికులకు గేటు పాస్‌లు ఇవ్వాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి.
- టెండర్ల ప్రక్రియ ముగిసిన కాంట్రాక్టర్‌ల వద్ద పనిచేసే కార్మికులకు మరోచోట ఉపాధి కల్పించాలి.
- 60 ఏళ్లు నిండిన కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలి.
- ప్రమాద ఘటనల్లో ఎక్స్‌గ్రేషియా రూ.30 లక్షలు చెల్లించాలి.
- ఎనిమిది గంటల పని దినాలు అమలు చేయాలి.
- ఈఎస్ఐ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి.
- ప్రమాదం జరిగిన చోట నుంచి ఈఎస్ఐ రిఫర్ చేసిన ఆస్పత్రి వరకు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.
- కార్మికుల నైపుణ్యాన్ని బట్టి డిజిగ్నేషన్‌లలో మార్పులు చేయాలి.
- ఖాళీ అయిన పోస్టులను నిర్వాసితులతో భర్తీచేయాలి.

ఆయిల్ మాఫియా

యానాం వెళ్లాల్సిన డీజిల్ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విక్రయం



- అక్కడ బంకుల పేరుతోనే బుకింగ్
- కానీ తాళ్లపాలెం సమీపాన గల బంక్‌లో అన్‌లోడింగ్
- రాంబిల్లి నేవల్ బేస్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బల్క్‌గా సరఫరా
- రింగ్‌మాస్టర్ ఆనందపురం ప్రాంతానికి చెందిన ఒక బంక్ నిర్వాహకుడు
- నౌకల నుంచీ ఆయిల్ కొని కాకినాడకు తరలింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఆనందపురం కేంద్రంగా పెద్ద డీజిల్ మాఫియా నడుస్తోంది. కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం వెళ్లాల్సిన డీజిల్‌ను స్థానికంగానే అమ్ముకుంటూ కొందరు భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ దొంగ వ్యాపారం వల్ల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పన్నుల రూపేణా రావలసిన ఆదాయం కోల్పోతుంది.



ఉత్తరాంధ్రాలో గత కొంతకాలంగా భారీ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందులో ప్రధానమైనవి అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని నేవీ ప్రత్యామ్నాయ స్థావరం కాగా మరొకటి భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం. అక్కడ పనిచేసే యంత్రాలకు పెద్ద మొత్తంలో డీజిల్ అవసరం. ఆయా సంస్థలు టెండర్లు పిలిస్తే..' ఆనందపురం రింగ్ మాస్టర్ తక్కువ ధర కోట్ చేసి కాంట్రాక్టు దక్కించుకుంటున్నారు. ఆయిల్ కంపెనీలు ఏ డీలర్‌కు అయినా లీటరుపై రూ.2.40 మాత్రమే కమీషన్ ఇస్తాయి. అలాంటప్పుడు రాంబిల్లిలో నేవల్ బేస్‌కు ఆ చుట్టుపక్కల ఉండే డీజిల్ బంక్ యజమానులే తక్కువ ధరకు సరఫరా చేయగలుగుతారు. కానీ 70 కి.మీ. దూరంలో ఉన్న ఆనందపురం డీలర్ తక్కువ ధరతో ఆ డీల్ దక్కించుకుంటున్నారు. ట్యాంకర్లను ఆనందపురం నుంచి పంపడానికే ఆయనకు వచ్చిన కమీషన్ సరిపోతుంది. అయినా భారీ ఎత్తున డీజిల్ ఎలా సరఫరా చేస్తున్నారని ఆరా తీస్తే అనేక విషయాలు తెలిశాయి.

యానాం పేరుతో బుకింగ్...

కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో బంకులకు కూడా విశాఖపట్నంలో గల ఆయిల్ కంపెనీల నుంచే డీజిల్ సరఫరా జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ కంటే అక్కడ డీజిల్ ధర తక్కువ. అది కేంద్ర పాలిత ప్రాంతం కావడంతో కొన్ని పన్నులు ఉండవు. ఏపీలో వ్యాట్ 27 శాతం కాగా అక్కడ అది ఏడు శాతమే. ఏపీలో లీటరుకు 4 రూపాయల సెస్, రోడ్ సెస్ మరో రూపాయి కలిపి ఇక్కడ డీజిల్ ధర లీటరు రూ.97 పడుతుండగా, యానాం బంకులకు అదే డీజిల్ రూ.85కు వస్తుంది. అంటే లీటరుకు రూ.12 తక్కువకు లభిస్తోంది. దీనిని ఆనందపురం రింగ్ మాస్టర్ తనకు అనుకూలంగా మార్చుకొని తప్పుడు వ్యాపారం చేస్తున్నారు. దీనికి ఓ ఆయిల్ కంపెనీ ఉద్యోగులు సహకరిస్తున్నారు. యానాంలో ఆ కంపెనీ పరిధిలో సుమారు ఐదు బంకులు ఉన్నాయి. వారు రోజుకు సగటున నాలుగు డీజిల్ ట్యాంకర్లు బుక్ చేసుకుంటారు. ఒక్కొక్కటి 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు ఇక్కడ డీజిల్ నింపుకుంటాయి. కానీ యానాం వెళ్లవు. వాటికి అమర్చిన జీపీఎస్ పరికరాలు కూడా పనిచేయవు. ఆనందపురం రింగ్ మాస్టర్ కశింకోట మండలం తాళ్లపాలెం సమీపాన పాత బయో డీజిల్ బంక్‌ను లీజుకు తీసుకొని అక్కడ ఈ డీజిల్ అన్‌లోడింగ్ చేసుకుంటారు. అక్కడి నుంచి రాంబిల్లిలోని నేవీ కాంట్రాక్టర్లకు సరఫరా చేస్తున్నారు. అక్కడ పెద్ద కాంట్రాక్టర్లకు బంకులు ఉన్నా, సబ్ కాంట్రాక్టర్లంతా వీరి దగ్గరే కొంటున్నారు. అనకాపల్లి మండలంలోనే కొని, అక్కడే సరఫరా చేయడం వల్ల ఖర్చులు పోను లీటరుకు పది రూపాయలు మిగులుతోంది. రోజుకు ఎలా లేదన్నా 80 వేల లీటర్లు విక్రయిస్తున్నారు. అంటే రూ.8 లక్షల ఆదాయం. ఇందులో ఎవరి వాటాలు వారికి వెళ్లిపోతాయి. ఈ బాగోతం బయట పడకుండా ఉండేందుకు యానాంలోని ఐఓసీ ... మిగతా 3వ పేజీలో

విద్యార్థులకు తగ్గనున్న మోత బరువు

సగానికి సగం పుస్తకాలు తగ్గింపు

- ప్రభుత్వ నిర్ణయం
- వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా డిపోకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు



డిపోకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు 38 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం
- ప్రస్తుతం 4 లక్షల వరకూ రాక

గాజువాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

విద్యార్థులకు మోతభారం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెమ్-1కు సంబంధించి ఒకటి, రెండు తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ కలిపి ఒక పాఠ్యపుస్తకం, ఒక వర్క్ బుక్ ఉంటాయి. గతంలో ఆరు పుస్తకాలు ఉండేవి. అటువంటిది రెండు పుస్తకాలకే పరిమితం చేశారు. అదేవిధంగా మూడు నుంచి ఐదో తరగతి వరకూ సెమ్-1కు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్ కలిపి ఒక పుస్తకం, మ్యాథ్స్, ఈవీఎస్ కలిపి ఒక పుస్తకం, రెండు వర్క్ బుక్స్ అందుబాటులోకి రానున్నాయి. గతంలో 8 పుస్తకాల వరకూ ఉండేవి. ఆరు, ఏడు తరగతులకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ కలిపి ఒక పుస్తకం, సైన్స్, సోషల్, మ్యాథ్స్ కలిపి ఒక పుస్తకం, రెండు వర్క్ బుక్స్ ఉంటాయి. ఎనిమిది, తొమ్మిది తరగతులకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ కలిపి ఒక పుస్తకం, పీఎస్, ఎన్ఎస్ కలిపి మరో పుస్తకం, హిస్టరీ, జియోగ్రఫీ, పాలిటిక్స్ కలిపి ఒక పుస్తకంగా, మూడు వర్క్ బుక్స్ అందజేస్తారు. గతంలో 15 పుస్తకాల వరకూ ఉండేవి. అటువంటిది ఆరు పుస్తకాలకు తగ్గించడంతో విద్యార్థులకు మోతభారం తగ్గనున్నది. సిలబస్ విషయంలో కూడా కొంత వెసులుబాటు కలగనున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేసేందుకు అధికారులు ... మిగతా 2వ పేజీలో

1 నుంచి సదరం స్లాట్స్

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

పెన్షన్లు, ఇతర రాయితీలకు సంబంధించి కీలకమైన 'సదరం' సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి సదరం స్లాట్లను కేటాయిస్తారు. ఆ ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి మంగళవారం వైద్యులు పరీక్షలు నిర్వహించి, దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పెన్షన్ వంటివి ... మిగతా 2వ పేజీలో

అటకెక్కిన విమ్స్ అప్‌గ్రేడేషన్

కార్యరూపం దాల్చని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్న హామీ

- రూ.250 కోట్లతో ఆరు బ్లాకులు నిర్మిస్తామని ప్రకటించిన గత వైసీపీ ప్రభుత్వం
- నిధులు ఇతర అవసరాలకు మళ్లించడంతో ముందుకుసాగని పనులు
- అప్‌గ్రేడ్ చేస్తే అందుబాటులోకి పీజీ మెడికల్ కళాశాల
- పెరగనున్న వైద్యులు, సిబ్బంది
- పడకల సంఖ్య 800కు పెరిగే అవకాశం



అప్‌గ్రేడేషన్ ప్రారంభం కాలేదు.

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో విమ్స్‌ను ఏర్పాటుచేశారు. అయితే, ఆస్పత్రి ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ముందుకు కదల్లేదు. గత ప్రభుత్వం విమ్స్ అప్‌గ్రేడేషన్‌కు రూ.250 కోట్లు కేటాయిస్తున్నట్టు వెల్లడించింది. ఈ నిధులతో కొత్తగా ఆరు బ్లాకులను నిర్మిస్తామని ప్రకటించింది. అయితే, ఆ నిధులను ఇతర అవసరాలకు బదలాయించడంతో

పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటు

తొలిదశలో సాధారణ, రెండో దశలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ఉద్దేశంతో విమ్స్‌ను ఏర్పాటు చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలంటే పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. కాలేజీ ఏర్పాటైతే నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో విభాగానికి ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరవుతాయి. వీటితోపాటు ఏటా ఆయా విభాగాలకు ... మిగతా 3వ పేజీలో

రియల్టర్ల మాయాజాలం

చినదబ్బందలో ప్రభుత్వ, పర్యాటక శాఖలకు చెందిన భూముల మీదుగా రహదారి నిర్మాణం

- పంచాయతీలో చక్రం తిప్పిన పెద్దలు
- రోడ్డుకు 15వ ఆర్థిక సంఘం నిధులు
- ఎటువంటి అనుమతులు తీసుకోకుండా స్థానిక ప్రజా ప్రతినిధుల ఇష్టారాజ్యం



దబ్బందలో కొండను తవ్వి చేపట్టిన రహదారి నిర్మాణం

విశాఖపట్నం/ఆనందపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ పరిధిలోని చినదబ్బందలో కొందరు రియల్టర్ల కోసం ప్రభుత్వ, పర్యాటక శాఖలకు చెందిన భూమిలో 70 నుంచి 80 అడుగుల వెడల్పున రహదారి నిర్మాణం చేపట్టడం విస్మయపరుస్తోంది. అందుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది.

అడవివరం జంక్షన్ నుంచి నీళ్లకుండీల వైపు వెళ్లే రహదారికి తూర్పున కొండల మధ్య దబ్బంద, దానికి ఆనుకుని మరో కొండ పక్కన చినదబ్బంద గ్రామాలు ఉన్నాయి. చినదబ్బంద గ్రామం దాటిన తరువాత టిడ్కో ఇళ్ల కాలనీ ఉంది. దానికి ఎదురుగా కొందరు రియల్టర్లు సుమారు 80 నుంచి 100 ఎకరాలు కొనుగోలు చేశారు. అయితే ఆ భూములకు రహదారి సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో తమ భూములకు పక్కా రహదారి నిర్మాణం చేపట్టేలా పంచాయతీ స్థాయిలో చక్రంతిప్పారు. దీంతో మరోచోట ప్రతిపాదించిన రెండు పనులను రద్దు చేసి మరీ చినదబ్బంద నుంచి రియల్టర్ల భూముల ... మిగతా 2వ పేజీలో

కేజీహెచ్‌కు ఎన్‌టీపీసీ రూ.2 కోట్ల విరాళం



కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను చెక్కును అందజేస్తున్న ఎన్‌టీపీసీ ప్రతినిధులు. చిత్రంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ఉన్నారు

మహారాణిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్ అభివృద్ధి నిమిత్తం సింహాద్రి ఎన్‌టీపీసీ అధికారులు గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను కలిసి రూ.రెండు కోట్లు చెక్‌ను అందజేశారు. ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు, ఆపరేషన్ థియేటర్ల అభివృద్ధి, డయాలసిస్ యంత్రాల కొనుగోలు ఈ నిధులను వినియోగించనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీపీసీ అధికారులు సమీర్‌శర్మ, బీబీ పాత్ర, కె.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.12 (శుక్రవారం సాయంత్రం) | సహర్: 4.37 (శనివారం ఉదయం)

పాఠశాలలకు ఉపశమనం

విద్యుత్ బిల్లుల భారం భరించేందుకు ముందుకువచ్చిన ప్రభుత్వం

- ఈపీడీసీఎల్‌కు ప్రస్తుతం విద్యా సంస్థల నుంచి రావలసిన మొత్తం రూ.1.57 కోట్లు
- రానున్న రోజుల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు దిశగా అడుగులు



విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యుత్ బిల్లుల భారం తప్పనుంది. పాఠశాలలు సక్రమంగా విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నాయని గుర్తించిన ప్రభుత్వం ఆ భారాన్ని మోయడానికి ముందుకువచ్చింది. ఇటీవల విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పుల కారణంగా మారుమూల గ్రామాల్లో కూడా తప్పనిసరిగా విద్యుత్ సరఫరా అవసరం ఏర్పడింది. వినియోగం కూడా పెరిగింది. దీంతో విశాఖలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు పాఠశాలల బిల్లుల బకాయి పెరిగిపోతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఇటీవల ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. పాఠశాలల బిల్లులను ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించింది. అయితే ఇంకా ఆదేశాలు వెలువడాల్సి ఉంది. విశాఖపట్నం సర్కిల్ వరకు లెక్కలు వేసుకుంటే జిల్లాలో 65 ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. వాటి నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.44,06,629 మేర బిల్లులు వసూలు కావాల్సి ఉంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 570 వరకు ఉండగా, వాటి నుంచి రూ.1,12,91,437 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.1.57 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

సబ్సిడీగా ఇచ్చే అవకాశం

ప్రభుత్వ ప్రకటన మేరకు విద్యా సంస్థల బిల్లుల మొత్తాన్ని సబ్సిడీగా డిస్కమ్‌లకు అందించే అవకాశం ఉంది.అయితే ప్రస్తుత నెలబిల్లు మాత్రమే ఇలా ఇస్తారా?, ఇప్పటివరకూ ఉన్న బకాయిల మొత్తం విడుదల చేస్తారా? అనేది తేలాల్సి ఉంది.

త్వరలో సోలార్ విద్యుత్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ విద్యుదుత్పత్తిని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాయి. ఈ పథకాలను వినియోగించుకునే ... మిగతా 3వ పేజీలో



పూజలు చేస్తున్న అర్చకుడు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పలు పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడా మండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృశింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున సిరి సంపెంగలతో అర్చనలు చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

నేటి నుంచి అంతర్జాతీయ మెకానికల్ సదస్సు

తగరపువలస, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సంగివలసలో ఉన్న అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో శుక్ర, శనివారం డిజైన్ ఇన్నోవేషన్స్, ఎనర్జీ సిస్టమ్ అన్న అంశంపై జాతీయ సదస్సు జరగనున్నట్టు మెకానికల్ విభాగం అధిపతి డా. బి. నాగరాజు తెలిపారు.గురువారం ఆయన తన కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సదస్సుకు ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ అధ్యక్షత వహిస్తారని, మచిలీపట్నం కృష్ణ వర్సిటీ వీసీ ప్రొ. రాంజీ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

నాటకాలపై అవగాహన

తగరపువలస, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో ప్రపంచ రంగ స్థల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు నాటకాల గురించి అవగాహన కల్పించారు.ఒక అంశాన్ని నాటకంగా ఎలా తీర్చిదిద్దుతారన్న విషయాన్ని ప్రత్యక్షంగా చూపించి, వారితో నాటకాలు వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్. అప్పలరాజు, ఉపాధ్యాయులు రమేష్, సంజీవి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే విజయం

భీమునిపట్నం (రూరల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాకమర్రి సమీపంలో రామునాయుడుపేటలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా ఎంఏ ఖాదర్‌భాషా మాట్లాడుతూ ఉద్యోగ సాధనకు కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరమని, ఇది నిరంతర సాధన, అధ్యయనంతోనే సాధ్యమని తెలిపారు. అనంతరం అనిట్స్ కళాశాల ఇంగ్లీష్ విభాగాధిపతి పణికుమారి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సింహాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పద్మావతినగర్, అడివివరంలో 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పద్మావతి నగర్, షిప్‌యార్డ్ లేఅవుట్, మైత్రినగర్, సింహాచల నగర్ (జంగాల కాలనీ), అడివివరం, భైరవవాక ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కొమ్మాది పరిధిలో...

కొమ్మాది : పీఎంపాలెం సబ్‌స్టేషన్ బక్కన్నపాలెం 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సిద్ధార్ట్ నగర్, గాయత్రినగర్ లేఅవుట్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రాంతాకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాయుడు తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

జిమ్ పరికరాలు అందజేత



పరికరాలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు నూకరాజు, తదితరులు

భీమునిపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోయవీధి మత్స్యకార యువతకు చిప్పాడ దివీస్ కంపెనీ జిమ్ పరికరాలను గురువారం అందజేసింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు వినతి మేరకు ఆ కంపెనీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా యువతకు వీటిని అందజేసింది. దివీస్ జీఎం ఎంఎస్ఎన్ రావు, గంటా నూకరాజు సంయుక్తంగా వీటిని ప్రారంభించారు. కార్యక్రమంలో మత్స్యకార కులపెద్దలు నాగరాజు, దుర్గారావు, కాశీరావు, అనిల్, శివ, శోభారావు, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి. సురేష్‌కుమార్, ప్రతినిధి పి. శేఖర్‌బాబు పాల్గొన్నారు.



తునివలసలో తగలబెట్టిన వ్యర్థాలు



నేరేళ్లవలసలో రోడ్డు పక్కన చెత్త కుప్ప

పల్లెల్లో ప్రమాద ఘంటికలు

- పంచాయతీల్లో పేరుకుపోయిన చెత్త
- నెలలు తరబడి కాలువల్లో తొలగించని పూడికలు
- రోడ్ల పక్కన చెత్త వేసి దహనం
- గ్రామాల్లో కాలుష్య వాతావరణం
- పొంచి ఉన్న వ్యాధుల భయం

పద్మనాభం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. కాలువలు పూడికలతో నిండిపోవడం, ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కొన్నిచోట్ల వీధుల్లో సేకరిస్తున్న చెత్తను రోడ్ల పక్కన వేసి తగలబెడుతున్నారు. అన్ని రకాల పొడి చెత్తను ఒకేచోట వేసి మంట పెట్టడంతో ఆయా పంచాయతీలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. చెత్తను కూడా తగలబెట్టకూడదని జాతీయ హరిత ట్రిబ్యునల్ నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసినా..ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలు ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నా.. అలా జరగడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్త అంతా రోడ్ల పక్కన ఉంటోంది. దీనికితోడు కోళ్ల వ్యర్థాలను కూడా రోడ్డు పక్కన పడేయడంతో ఆ ప్రదేశాలు దుర్గంధభరితంగా తయారవుతున్నాయి. పద్మనాభం, రేవిడి, మద్ది, రెడ్డిపల్లి, తునివలస, అయినాడ, బీఆర్ తాళ్ల వలస, నేరేళ్లవలస పంచాయతీల్లో దుస్థితే దీనికి నిదర్శనం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేయించి, తడి చెత్తతో వానపాము ఎరువును, పొడి చెత్తను విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని ప్రభుత్వం చెబుతున్నా.. అవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి.మండల కేంద్రమైన పద్మనాభంలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా... అధికారులు కనీసం స్పందించడం లేదు. అనంతుని మెట్ల మార్గానికి వెళ్లే దారిలో నిత్యం మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నా... పట్టించుకున్న వారే కరవయ్యారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఫొటోలకే పరిమితమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



విజయానందపురం జంక్షన్ వద్ద కోళ్ల వ్యర్థాలు

టీడీపీ కార్యకర్తల సమావేశం

భీమునిపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం జయంతి వారి అగ్రహారంలో జరిగింది.వార్డు అధ్యక్షుడు పాసి నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రతి 60 మంది కార్యకర్తలకు ఇద్దరు కుటుంబ సాధికార సారధులను నియమించనున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో నాయకులు బోర బంగారురెడ్డి,గరికిన కింగ్, పోతిన అప్పలరాజు, రమణ, అప్పలనాయుడు, శ్రీను, పోలమ్మ, ఎల్లాజి పాల్గొన్నారు.

1 నుంచి సదరం స్లాట్స్

... 1వ పేజీ తరువాయి

పొందేందుకు అవకాశం ఉం టుంది. ఈ సదరం స్లాట్లను మీసేవ, గ్రామ/వార్డు సచివాలయాల్లో బుక్ చేసుకోవచ్చు. ఆ తరువాత సదరు వ్యక్తి ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్ రూపంలో వివరాలు వస్తాయి. సదరు స్లాట్‌లో కేటాయించిన ఆస్పత్రికి అందులో పేర్కొన్న తేదీ, సమయానికి వెళ్లి వైద్యులకు చూపించుకోవాల్సి ఉంటుంది.సదరు వైద్యులు వైకల్యాన్ని నిర్ధారించి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. సదరం సర్టిఫికెట్లను శారీరక, మానసిక వైకల్యం ఉన్న వారికి, కంటిచూపు లోపం ఉన్న వారికి కేటాయిస్తారు.



పూలతో సుందరంగా ఉన్న ఆలయం



ఉత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా నూకాలమ్మ తొలేళ్లు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భీమునిపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజల గ్రామ దేవత నూకాలమ్మ తొలేళ్ల ఉత్సవం గురువారం అర్ధరాత్రి నుంచి ఘనంగా ప్రారంభమైంది. ముందుగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు, ప్రధాన కార్యదర్శి యెచ్చర్ల హరి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పాసి వినోద్‌కుమార్, కో ఆర్డినేటర్ గొరపల్లి సన్యాసిరావు తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంట స్తంభం వేదిక వద్ద కమిటీ అధ్యక్షుడు వేణుబాబు తొలేళ్ల ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పులివేషాలు, సాము గరిడీ, గ్రూపు డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కాగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తారు. ఈమేరకు ఆలయం వద్ద ఈవో మురళీమోహన్ ఆధ్వర్యంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భీమిలి జోనల్ శానిటేషన్ అధికారులు బీఎం నాయుడు, రామశర్మ, రేగాని రవి ఆధ్వర్యంలో పురవీధులు, ఆలయం వద్ద పరిసరాలను శుభ్రం చేసి, రహదారికి ఇరువైపులా సున్నం మార్కింగ్‌లు చేశారు. స్పెషల్ దర్శనానికి రూ. 100, విశిష్ట దర్శనానికి రూ. 25, సాధారణ దర్శనం రూ. 10, ఉచిత దర్శనాలకు క్యూ లైన్లు ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు. చిన్నారులకు బిస్కెట్లు, పాలు ఉచితంగా అందిస్తామని, భక్తులకు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. భీమిలి సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపడుతున్నారు.

10, 11 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

తగరపువలస, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో వచ్చే నెల 10, 11వ తేదీల్లో సీపీఐ జిల్లా మహా సభలు జరగనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. గురువారం ఆయన సీపీఐ కార్యాలయం జీఆర్ భవన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. ఈ సభలను నిర్వహిస్తున్నామని చెప్పారు. 11న జరిగే సమావేశానికి పార్టీ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ముఖ్యఅతిథిగా రానున్నట్టు తెలిపారు. మోదీ ప్రభుత్వం మతపరమైన అంశాలను ఉపయోగించి పాలన సా గిస్తూ ముస్లింలు, క్రైస్తవులపై దాడులు చేయిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరు పేద లకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు నిర్మాణానికి రూ. 5 లక్షలు చొప్పున ఇస్తామని చెప్పి మభ్యపెట్టిందని విమర్శించారు. ఈ అంశాలపై మహా సభల్లో తీర్మానాలు చేస్తామన్నారు. అనంతరం పార్టీ ఏరియా కమిటీ ఎన్నిక నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కానూరి రాంబాబును ఏరియా కార్యదర్శిగా మోర అప్పలరాజును సహాయ కార్యదర్శిగా, ఎరుసు అప్పలనర్సయ్య, నూలు అదినారాయణ, అల్లం గోవింద, పల్లా లక్ష్మణరావు, మాదాబత్తుల రామారావులను సభ్యులుగా ఎన్నుకున్నారు. మాజీ కౌన్సిలర్ మావూరి సన్యాసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు కొండపు ఈశ్వరరావు, రాంపైడి, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

అగ్నిమాపక శాఖ రీజనల్ అధికారి నిరంజన్‌రెడ్డి

భీమునిపట్నం (రూరల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, వాటి నివారణకు ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నామని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి పి. నిరంజన్ రెడ్డి తెలిపారు. గురువారం తాళ్లవలస అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రమాదాలు జరిగితే నివారణకు అందుబాటులో ఉన్న పరికరాలు, ఇతర వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటి పని విధానాలను చూశారు. వాహనం ఎలా పని చేస్తుందని అడగ్గా ఇటీవల దివీస్ యాజమాన్యం మరమ్మతుకు నిధులు కేటాయించిందని అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీనివాసరాజు చెప్పారు. అనంతరం నిరంజన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని, వాటిని నివారించడానికి ఇప్పటి నుంచే సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత నివారణ చర్యలు తీసుకునే కంటే జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా అపార్టుమెంట్లు, పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, ప్రజలను ప్రమాదాల నివారణపై అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.



పరికరాలను పరిశీలిస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి

ఫుల్ బ్రైట్ స్కాలర్ విద్యార్థులకు ఉపయోగకరం

సాగర్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : భారతీయ విద్యార్థులకు, పరిశోధకులకు, వృత్తి నిపుణులకు అమెరికాలోని విద్యా సంస్థల్లో అధ్యయనం చేయడానికి అవసరమైన నిధులను అందించి ప్రోత్సహించడంలో యూనైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ గత 75 ఏళ్లుగా కృషి చేస్తోందని యూఎస్‌ఐఈఎఫ్ ప్రాంతీయ అధికారి (చెన్నై) మాయా సుందర రాజన్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వెబినార్‌లో ఆమె మాట్లాడారు. ఏటా ఫిబ్రవరిలో దీనికి సంబంధించిన ప్రకటన జారీ చేస్తామని, దరఖాస్తు చేసుకునే గడువు మే నుంచి జూలై మధ్య ఉంటుందని చెప్పారు. యూఎస్ ఐఈఎఫ్ ద్వారా ఫుల్ బ్రైట్ నెహ్రూ మాస్టర్స్ ఫెలోషిప్, ఫుల్ బ్రైట్ నెహ్రూ డాక్టోరల్ రీసెర్చి ఫెలోషిప్, ఫుల్ బ్రైట్ నెహ్రూ పోస్ట్ డాక్టోరల్ రీసెర్చి ఫెలోషిప్ అందిస్తున్నామని వెల్లడించారు. ఆంగ్ల భాషా ప్రావీణ్యంతో పాటు తాము అధ్యయనం చేసే సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానం, సామాజిక ప్రయోజనాలు, వ్యక్తిగత ప్రతిభను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రాము దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

కొమ్మాది, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థుల క్రమశిక్షణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి అన్నారు. గురువారం ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పెంటకోట రాము పదవీ విరమణ చేయడంతో సిబ్బందిని ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ రాము వ్యాయామ ఉపాధ్యాయుడిగా, యోగా నిపుణుడిగా విద్యార్థులకు ఎనలేని శిక్షణ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి దేముడు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు,లలిత కుమార్, విశాఖ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ సారె ఊరేగింపు



సారెను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

కొమ్మాది, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఉన్న నూకాలమ్మ ఆలయంలో గురువారం నుంచి కొత్త అమావాస్య ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అనూష క్యాటరింగ్ అధినేత పోతిన ప్రసాద్ కాలనీవాసులతో కలిసి ఆర్‌హెచ్ కాలనీలో అమ్మవారి ఆలయానికి పసుపు ,కుంకుమ, సారెను భారీ ఊరేగింపుతో తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోతిన ఎల్లాజీ, బీజేపీ నాయకుడు కేఎన్‌పీ చక్రవర్తి, తెర్లి నాగేశ్వరావు, బాల సుందరం, పోతిన నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘టీడీపీకి కార్యకర్తలే బలం’

కొమ్మాది, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి కార్యకర్తలే బలమని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. గురువారం ఆమె పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, సోంబాబు, నాగోతి సత్యనారాయణ, కొండపు రాజు, రవి, బోయి శ్రీను పాల్గొన్నారు.



భీమిలి తీరంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న సిబ్బంది

బీచ్‌లో ప్రమాదాలకు చెక్

- భీమిలి తీరంలో సైఫ్ ఆటోమేషన్ సర్వీసెస్ కంపెనీ ట్రయల్ రన్

భీమునిపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తీరంలో ప్రమాదాల నివారణకు మధురవాడ ఐటీ సెజ్ హిల్ నంబరు 3లో ఉన్న సైఫ్ ఆటోమేషన్ సర్వీసెస్ కంపెనీ నిపుణులు సేఫ్ ఆటోమేషన్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం వారు ఈ మెషన్లను భీమిలి తీరానికి తీసుకువచ్చారు. వీటి ద్వారా సముద్రంలో గల్లంతయ్యే వారిని కిలోమీటరు వరకూ రిమోట్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో కాపాడవచ్చు. వీటిని బీచ్ కారిడార్‌లో లైఫ్ బాయ్ మెషన్ పేరుతో ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు భీమిలి బీచ్‌లో సంబంధిత కంపెనీ ఉద్యోగులు ఈ మెషన్లతో ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ పరికరాలను విశాఖ - భీమిలి తీరంలో అమర్చే విధంగా నేవీ, జీవీఎంసీ జాయింట్ ఆపరేషన్‌తో చర్యలు తీసుకోనున్నారని పర్యాటక శాఖాధికారుల ద్వారా తెలిసింది.

30, 31 తేదీల్లో పనిచేయనున్న రిజిస్ట్రార్ కార్యాలయాలు

... 1వ పేజీ తరువాయి

11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తాయని వెల్లడించింది. అయితే రిజిస్ట్రేషన్‌కు అవసరమైన చలానాలు చెల్లించడానికి బ్యాంకులు కూడా అవసరం కాబట్టి, ఎస్‌బీఐకి ఈ మేరకు లేఖ రాసినట్టు, వారు కూడా ఆ రోజున కొన్ని శాఖలను తెరిచి ఉంచుతారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే ఈ రెండు సెలవు రోజుల్లో పనిచేసిన ఉద్యోగులకు వేరే రోజుల్లో సెలవు తీసుకునే అవకాశం కల్పించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. విశాఖపట్నం జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ మార్చి నెల ఆదాయ లక్ష్యం రూ.136 కోట్లు కాగా 27వ తేదీ నాటికి రూ.79 కోట్లు వచ్చిందని, ఈ నాలుగు రోజుల్లో మరింత వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

విద్యార్థులకు తగ్గనున్న మోత బరువు

... 1వ పేజీ తరువాయి

సన్నాహాలు చేస్తున్నారు. ఏటా మే నెలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తుంటారు. అయితే కొత్త ప్రభుత్వం ఈ ప్రక్రియను మార్చి నుంచే ప్రారంభించింది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఉన్న 46 మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ఏడాది సుమారు 38 లక్షలకు పైబడి పుస్తకాలు అవసరమవుతాయని అధికారులు లెక్కించారు. ప్రస్తుతం వివిధ తరగతులకు సంబంధించి 3,99,153 పుస్తకాలు గాజువాకలోని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల విక్రయ కేంద్రానికి చేరుకున్నాయి. దఫదఫాలుగా ఏప్రిల్ నెలాఖరులోగా మొత్తం పుస్తకాలు డిపోకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రియల్టర్ల మాయాజాలం

... 1వ పేజీ తరువాయి

వరకూ రహదారి నిర్మాణం చేపట్టేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు సిద్ధమయ్యారు. ఐదారు రోజుల నుంచి రెండు ప్రొక్లెయినర్లతో పనులు చేపట్టడంతో వ్యవహారం బయటకు వచ్చింది. రహదారి నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో ప్రభుత్వ భూమితో పాటు పర్యాటక శాఖకు చెందిన స్థలం ఉన్నాయి. కానీ మండల తహసీల్దార్ నుంచి గానీ, పర్యాటక శాఖ నుంచి గానీ అనుమతి తీసుకోలేదు. అలాగే కొంతమేర జిరాయితీ భూములు కూడా ఉన్నాయి. బెదిరించడంతో రైతులంతా మౌనంగా ఉండిపోయారు. ప్రస్తుతం రహదారి నిర్మాణం కోసం 70 నుంచి 80 అడుగుల వెడల్పున కొండ, దానికి ఆనుకుని భూమిని తవ్వేశారు.కొండను తవ్వేటప్పుడు గనుల శాఖ అనుమతి తీసుకోలేదు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి. కానీ, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు ఎటువంటి వర్క్ ఆర్డర్ ఇవ్వలేదు. రోడ్ నిర్మాణంతో తమకు సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు. కాగా అనుమతి లేకుండా ప్రభుత్వ, పర్యాటక శాఖ భూమి గుండా రోడ్డు నిర్మించడాన్ని రెవెన్యూ శాఖ తీవ్రంగా పరిగణించింది. భీమిలి ఆర్డీవో సంగీతమాథుర్, ఆనందపురం తహసీల్దార్ శ్యాంప్రసాద్ రోడ్డును పరిశీలించి యంత్రాలను సీజ్ చేశారు. రహదారి నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దారు స్పష్టంచేశారు. ఈ విషయమై మామిడిలోవ సర్పంచ్ మల్లికార్జునరావును ప్రశ్నించగా 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టామన్నారు. ఇంజనీరింగ్ శాఖ నుంచి అనుమతులు త్వరలో తీసుకుంటామని, గ్రామస్థుల కోసమే రహదారి నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణ

విచారణాధికారిగా తుమ్మపాల సుగర్స్ ఎండీ

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)లో అనేక అవకతవకలు బయటపడిన నేపథ్యంలో సహకార శాఖ 51 విచారణకు ఆదేశించింది. ఈపీడీసీఎల్ నుంచి తక్కువ రేటుకు విద్యుత్ కొని దానిని మూడు రెట్లు ఎక్కువకు విక్రయించి లాభాలు పొందుతున్న ఆర్ఈసీఎస్ ఆ నిధులను పక్కదారి పట్టించింది. ఉద్యోగులు, ఉన్నతాధికారులు అంతా కలిసి కోట్లాది రూపాయలు స్వాహా చేశారని ఫిర్యాదులు అందడంతో సొసైటీని స్థానిక డిస్కమ్‌కు అప్పగించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశించింది. దాంతో ఆర్ఈసీఎస్‌ను గత రెండేళ్లుగా ఈపీడీసీఎల్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తప్పులు బయటపడడంతో ఎండీని తప్పించారు. అయితే పూర్తిస్థాయి విచారణ ఇప్పటికీ నిర్వహించలేదు. బాధ్యులను గుర్తించలేదు. దీనిపై స్థానిక నాయకులు ఫిర్యాదు చేయడంతో సహకార శాఖ కమిషనర్ 51 విచారణకు ఆదేశించారు. ఇలాంటి సమయాల్లో విచారణ అధికారిని వారే నిర్ణయిస్తారు. కానీ ఈ కేసులో ఎందుకో ఆ బాధ్యత జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)కే అప్పగించారు. దాంతో ఇక్కడి డీసీఓ ప్రేమస్వరూప విచారణాధికారిగా తుమ్మపాల సుగర్స్ ఎండీ ఎంవీఎస్ శాస్త్రిని నియమించారు. నిధులు దుర్వినియోగంపై లోతైన విచారణ చేస్తే తప్ప వాస్తవాలు బయటకు రావనే వాదన వినిపిస్తోంది.

రంజాన్ తోఫా పంపిణీ

భీమునిపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ముస్లింలకు రంజాన్ పురస్కరించుకుని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి గురువారం రంజాన్ తోఫా అందజేశారు. జామియా మసీదులో జరిగిన ఈ కార్యక్రమంలో 25 నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు ప్రెసిడెంట్ అన్వర్, సెక్రటరీ భాషా, నాయకులు తాజుద్దీన్, వారిష్, సుభానీ, ఇమామ్ నసీమ్ అక్తర్, మత పెద్దలు పాల్గొన్నారు.



ముస్లింలకు సరకులు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

పక్కా పింఛన్... నో టెన్షన్

» వేలి ముద్రల సమస్యకు చెక్ » ఏప్రిల్ నుంచి ఎల్-1 స్కానర్లలో పంపిణీ » జోన్-3లో సచివాలయ సిబ్బందికి 463 స్కానర్ల అందజేత

మద్దిలపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారులకు వేలిముద్రల ఇబ్బందుల నుంచి ఉపశమనం కల్పించనుంది. అధునాతన వేలి ముద్రల స్కానర్లను అందుబాటులోకి తెచ్చింది. దీంతో వేలి ముద్రలు పడడం లేదనే సమస్యలతో పాటు పింఛన్ పంపిణీలో జాప్యం, అవకతవకలకు ఆస్కారం లేకుండా చేసింది. ఏప్రిల్ నెల నుంచి కొత్త వేలిముద్రల స్కానర్ల ద్వారా పింఛన్ల పంపిణీ కోసం అందుబాటులోకి తెస్తున్నారు. గత ప్రభుత్వం పింఛన్ పంపిణీకి ఎల్-0 స్కానర్లను అందించింది. అయితే కొన్నిసార్లు పింఛనుదారుల నుంచి వేలి ముద్రలు తీసుకున్నప్పుడు ఎల్-0 స్కానర్లు మొరాయించేవి.

చాలా ఏళ్లుగా ఇవే వినియోగించడంతో రిపేర్లకు గురయ్యాయి. దీంతో అందుబాటులో ఉన్న స్కానర్లతోనే సచివాలయ సిబ్బంది సర్దుకుని ఫించన్ పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ భరోసా పథకం ఫించన్ల పంపిణీకి ఇవే స్కానర్లు ఉపయోగిస్తున్నారు. అయితే స్కానర్ల ఇబ్బందులు దృష్ట్యా ప్రభుత్వం ఎల్-0 స్థానంలో అప్‌డేటెడ్ వెర్సన్‌తో తయారు చేసిన ఎల్-1 స్కానర్లు తీసుకొచ్చింది. అంతేకాకుండా ఆధార్ సాఫ్ట్‌వేర్ యూఐడీఏఐను ఆధునికీకరించి పాత పరికరాలను పక్కన పెట్టింది. ఈ నెల 31తో ఇంకా పాత స్కానర్లు ఉండవు.



కొత్తగా ఉపయోగించనున్న ఎల్-1 స్కానర్

జోన్-3లో 463 స్కానర్ల పంపిణీ...

జీవీఎంసీ జోన్-3లో 73 సచివాలయాలున్నాయి. ఆయా సచివాలయాల్లో 463 మంది సిబ్బంది పని చేస్తున్నారు. జోన్-3లో 14500 మంది ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్దిదారులున్నారు. ప్రతీ నెలా సచివాలయ సిబ్బంది ఎల్-0 స్కానర్ల ద్వారా వారికి ఫింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఆయా స్కానర్లు సరిగ్గా పనిచేయక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సచివాలయ పరిధిలో ఒక ఉద్యోగి పంపిణీ చేసిన తర్వాత ఆ స్కానర్ తెప్పించుకుని మరో ఉద్యోగి తన పరిధిలో పింఛన్ పంపిణీ చేసేవారు. దీంతో సమయపాలనతో పాటు పింఛనుదారులు అసహనం చెందేవారు. తాజాగా.. ప్రభుత్వం అందించిన కొత్త స్కానర్లను అందించడంతో సచివాలయ సిబ్బందికి కష్టాలు తప్పినట్టే. ఇప్పటికే జోన్-3 సచివాలయాలకు 463 కొత్తఎల్-1 స్కానర్లను అందించారు.

ఏప్రిల్ నుంచి కొత్త స్కానర్లు

ఏప్రిల్ 1 నుంచి సచివాలయ సిబ్బంది కొత్త స్కానర్లతో ఫింఛన్లు అందించనున్నారు. వచ్చే నెల నుంచి వేలిముద్రల సమస్యల నుంచి పరిష్కారం దొరుకుతుందని సచివాలయసిబ్బంది సైతంఆనందంవ్యక్తంచేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ హనుమంతవాక ఫీడర్ మరమ్మత్తుల పనులు చేపడుతుండడంతో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. చినగదిలి, పెదగదిలి, దీనదయాళ్‌పురం, కమర్షియల్ టాక్స్ కార్యాలయం,ఎస్సీ కాలనీ, శాలిపేట, 11 కేవీ అంబేడ్కర్ నగర్ ఫీడర్ పరిధిలో గల జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాక్స్, శ్రీకాంత్ నగర్, లే అవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. విని యోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా నూకాలమ్మ తొలేళ్లు


నూకాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కాలనీలో ఉన్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన తొలేళ్ల మహోత్సవంలో గ్రామస్థులంతా పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు డి.వెంకటాచార్యులు శర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బుగత సత్యనారాయణ, ఆర్.నరేంద్ర, బోను శ్రీను, కాళ్ల నరసింగరావు, కె.మహేష్ పాల్గొన్నారు.

విశాఖ ఉడ్ డెకార్స్ వెల్ఫేర్ సంఘం

నూతన కార్యవర్గం

ఆరిలోవ, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉడ్ డెకార్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని పైనాపిల్ కాలనీలో గల జిల్లా కార్యాలయంలో గురువారం కార్పెంటరీ దినోత్సవం సందర్భంగా ఎన్నిక నిర్వహించినట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కానూరి లక్ష్మణరావు తెలిపారు. అధ్యక్షుడిగా కందుకూరి రామమోహనరావు, ప్రధాన కార్యదర్శిగా ఆరిపాక మురళీ మోహన్ (శ్రీను) కోశాధికారిగా లక్కోజు బ్రహ్మానందం, ఉపాధ్యక్షుడిగా అలమండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు-2 గా కుప్పిలి లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శిగా టేకు కృష్ణ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు లక్ష్మణరావు తెలిపారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్ :** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 10, క్యారెట్ 28 దొండకాయలు 24, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్ధచిక్కుడు 56, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 42, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	88
లైవ్ ధర	108
విత్ స్కిన్	186
స్కిన్‌లెస్	196

ఘనంగా కార్పెంటర్ల దినోత్సవం

» వడ్రంగులు రూపొందించిన కళాకృతులతో భారీ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వడ్రంగులు

ఆరిలోవ, మార్చి27(ఆంధ్రజ్యోతి) పనికి రాని కర్రముక్కలను సైతం అందమైన కళాఖండాలుగా తీర్చిదిద్దగల సమర్థత వడ్రంగులకు సొంతమని ఏపీ కార్పెంటర్స్ సంఘం మాజీ అధ్యక్షుడు వేముల కన్నప్రసాద్ అన్నారు. కార్పెంటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం తాము రూపొందించిన వివిధ కళా వస్తువులను ఆటోల్లో పెట్టి వడ్రంగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరిలోవ నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కన్నప్రసాద్ మాట్లాడుతూ.. సాంకేతికత వల్ల కార్పెంటరీలకు కొంత ఇబ్బంది ఎదురవుతోందని, ఇలాంటి తరుణంలో తమను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాచరిక పాలనా కాలంలో వడ్రంగులు కర్రతో రూపొందించిన శిల్పాలు, నగిషీలతో కూడిన ద్వారాలు ఆయా రాజ్యాల్లో ప్రత్యేకంగా నిలవడమే కాకుండా ఈనాటికీ ఆ తరం మిగిల్చిన వారసత్వ సంపదగా మిగిలి ఉన్నాయన్నారు. ఇది వడ్రంగుల ప్రతిభకు తార్కాణమన్నారు. విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడ్రంగులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని, ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడం, కార్పొరేట్ సంస్థలు మార్కెట్లోకి రావడం, పోటీ పెరగడం వల్ల కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు, వడ్రంగులువ బేతాళ సన్యాసిరావు, పూడి సురేష్, చిట్టూరి కృష్ణ, తవిరి శ్రీనివాస్, గోవింద్ రాజేష్, హరిబాబు బ్రహ్మజీ పాల్గొన్నారు.

కరకచెట్టు పోలమాంబ ఆలయంలో హుండీ లెక్కింపు

» గత రెండు నెలలకు రూ.6,81,853 ఆదాయం


హుండీ ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరిసేవ సభ్యులు తదితరులు

పెదవాల్తేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో వెలిసిన శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కించారు. రెండు నెలలకు గాను హుండీ లెక్కింపు ద్వారా నగదు రూ. 6,81,853 రూపాయిలు, బంగారం 140 గ్రాములు, వెండి రెండు కేజీల 25 గ్రాములు వచ్చినట్టు దేవస్థానం ఈవో కె.గాయత్రి తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి పీఎస్ఎన్ మూర్తి, ఈవో భూ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం అక్కయ్యపాలెం, పెదవాల్తేరు గ్రామ సంఘం సభ్యులు, 3 టౌన్ పోలీసులు, శ్రీహరిసేవా సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోండి

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ గిరిధర్


హాజరైన విద్యార్థులు

వెంకోజీపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : చట్టాలు చాలా కఠినంగా ఉంటాయని, తప్పు చేస్తే వాటి పర్యవసానాలు నిందితుల జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపేలా ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. గురువారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏయూ సంయుక్తంగా నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా జస్టిస్ గిరిధర్ మాట్లాడుతూ చిన్నారులను లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షించడానికి పోక్సో చట్టాన్ని తీసుకురావడం జరిగిందని చెప్పారు. ఈ చట్ట పరిధిని తెలుసుకునే ప్రయత్నం ప్రతి వ్యక్తి చేయాలని సూచించారు. నేరానికి పాల్పడిన వారు మైనర్ అయినా సరే శిక్ష తప్పదని చెప్పారు. పోక్సో కేసులో జీవిత ఖైదు, 20 ఏళ్ల వరకు శిక్షలు పడే అవకాశం ఉందని వివరించారు. హైకోర్టు సూచించిన విధంగా విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పలు కేసుల పరిష్కారంలో ఆధునిక సాంకేతికలు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. ముఖ్యంగా విద్యావంతులైన యువత ఈ చట్టం గురించి తెలుసుకొని ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు సమాజానికి మార్గనిర్దేశకులుగా నిలవాలని, చట్టాల పట్ల వారిలో అవగాహన పెంచాలని సూచించారు. ఎవరైనా తెలిసో, తెలియకో బాలబాలికలపై లైంగిక చర్యలకు దాడికి పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోలేరని, వారి జీవితం అంధకారం అవుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. మైనర్ పట్ల అంగీకారంతో అనుచితంగా ప్రవర్తించినా అది నేరం కిందే వస్తుందని చెప్పారు. సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం యువతపై ఎక్కువగా పడుతోందని, వీటి నుంచి దూరంగా ఉండటం మంచిదని సూచించారు. వీటి ప్రభావానికి యువత గురికాకుండా దృఢమైన మనసుతో ముందుకు సాగాలన్నారు. ముందుగా ప్రజల మైండ్ సెట్‌లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. మన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నిలుపుకుంటూ, జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. వివిధ సందర్భాల్లో న్యాయస్థానంలో తనకు ఎదురైన సంఘటనలను విద్యార్థులకు వివరిస్తూ చట్టపరిధి, శిక్షలు వాటి పర్యవసానాలను ఆసక్తిదాయకంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ఏయూ ఉప ఉలకులపతి జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విభిన్న సామాజిక అంశాలపై విద్యార్థులను చైతన్యం చేసే విధంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి చిన్న కుటుంబాల ఏర్పడడంతో కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. ప్రతి వ్యక్తి నిత్యం తనలో తాను ఒకసారి మాట్లాడుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. మానసికంగా దృఢంగా ఉండడం, మన సమస్యలను కుటుంబ సభ్యులతో పంచుకోవడం యువత అలవాటు చేసుకోవాలని సూచించారు. సమాజ ప్రగతికి దోహదపడే విధంగా యువత నడుచుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.శశిభూషణరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ, మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరి పాల్గొని పోక్సో చట్టాన్ని విపులంగా వివరించారు.

పలు వార్డుల్లో పరిశుభ్రతకు చర్యలు

ఆరిలోవ, మార్చి27 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో గల 12, 13, 11, 10 వార్డుల్లో వీధుల్లో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది గురువారం చెత్తాచెదారాలను ఏరివేసి పరిశుభ్రం చేశారు. ఉదయం నుంచి సాయింత్రం వరకు ఆయావార్డులను శుభ్రపరిచారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సెంట్రల్ సిబ్బంది అన్నివీదుల్లో వార్డులో పర్యటిస్తారని తెలిసింది. ఇందులో భాగంగా పరిశుభ్రత చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు.

'గాజా మారణహోమాన్ని ఆపాలి'

సిరిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అమెరికా సామ్రాజ్యవాదులు అండదండలతో పాలస్తీనా ఇజ్రాయిల్ సాగిస్తున్న మరణఖండాన్ని వెంటనే ఆపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం పౌర, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఉన్న యుద్ధ నియమ, నిబంధన ఉల్లంఘించి గాజాలోని ఆస్పత్రులపై చిన్న పిల్లలు, మహిళలపై అత్యంత వాసవికంగా బాంబులతో దాడులు చేయడం దుర్మార్గమన్నారు.పౌర సమాజం పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిలబడాలని అలాగే పాలస్తీనా భూభాగంలో ఉన్నటువంటి ఇజ్రాయిల్ సేలను వెంటనే వెనక్కి రప్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా,పౌర సంఘాల నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, వీఎస్ కృష్ణ, ఎం.లక్ష్మీ, కే.లలిత, ఎం.మన్మథరావు, రెహమాన్, నాగభూషణరావు, కొడవజ్రం, రామ్‌ప్రభు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వెంకోజీపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులోని ఇసుకతోట రజకవీధిలో గురువారం మహిళలకు క్యాన్సర్ అవగాహన, ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 115 మంది మహిళలు ఇందులో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు నారు గోపి జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని కేక్‌ను కట్‌చేసి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.సతీష్, జి.అప్పన్న, మొల్లి శోభ, మొల్లి శంకర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, కాళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నగర బీజేపీ కార్యాలయంలో ముగిసిన కంప్యూటర్ శిక్షణ


జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు నుంచి ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

పెదవాల్తేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ నగర కార్యాలయంలో స్కిల్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎం. ఎంఎన్ పరశురామ్‌రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ స్కిల్ డెవలప్ మెంట్ సెల్ కన్వీనర్ ఉగ్గిన శ్రీనివసరావు, ఎస్‌కేడబ్ల్యుఎస్ ప్రెసిడెంట్ గంట వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ కిషోర్ గుప్తా, లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ అగర్వాల్, ఎంఎం మహేష్, బీజేపీ జిల్లా ప్రధాన కర్యదర్శి ఎస్.ధనేశ్వరరావు, బీజేపీ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ కె.ప్రసాదరావు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వే డివిజన్‌లో హిందీ అమలుపై సమావేశం



'విశాఖ వాణి' హిందీ పత్రికను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్‌లో అధికార భాష హిందీ అమలుపై గురువారం కమిటీ సమావేశం జరిగింది. డీఆర్ఎం హాలులో రాజ భాష విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాజభాష అమలుకు సంబంధించి వార్షిక కార్యక్రమాలతో పాటు చేపడుతున్న చర్యలపై చర్చించారు. అనంతరం 'విశాఖ వాణి' హిందీ పత్రికను డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పత్రికలో నైపుణ్యాలకు సంబంధించిన అంశాలతో కథనాలుంటాయని పేర్కొన్నారు. హిందీ బాష అమలులో భాగంగా ఉద్యోగులకు హిందీ బాషపై శిక్షణ ఇవ్వడం, వ్యాస రచన పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, రాజభాష అధికారి సంతోష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రం


కేంద్రంలో పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : మన గుర్తింపునకు ఆధారమైన ఆధార్ కార్డును అందరూ అప్‌డేట్ చేసుకోవాలని తూర్పు నియోజకవర్గం శాశనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అప్‌డేట్ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పనికీ ఆధార్ తప్పనిసరి పరిస్థితుల్లో ప్రస్తుతం అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొలగాని పోలరావు, ఆడారి కామేశ్వరరావు, మద్దిల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ కమిషనర్ అభివృద్ధి పనుల పరిశీలన


మల్టీ లెవెల్ కార్‌పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్సును పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు

విశాఖపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాధన్ సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్డీఏ నిర్మించిన మల్టీ లెవెల్ కార్‌పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్సును గురువారం పరిశీలించారు. కాంప్లెక్సులో మిగిలిన సివిల్ పనులు, గ్రీనరీ ఏర్పాటు తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ మధుసూధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉపశమనం

... 5వ పేజీ తరువాయి

వారికి రాయితీలు కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి విద్యా సంస్థలో విద్యుత్ అవసరాల మేరకు సోలార్ ప్రాజెక్టులు నెలకొల్పి, అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకునేలా చూడాలని యోచిస్తున్నారు. ఇది సాకారమైతే విద్యుత్ బిల్లులను ప్రభుత్వం కూడా భరించాల్సిన అవసరం ఉండదు. సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన పెట్టుబడి ఒకసారి పెడితే సరిపోతుంది.

అన్ని విద్యా సంస్థల్లో మైదానాలు, పైకప్పులు ఖాళీయే కాబట్టి వాటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని ఈపీడీసీఎల్ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

త్వరలోనే వీటిపై మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉందని వివరించారు.

అటకెక్కిన విమ్స్ అప్‌గ్రేడేషన్

... 1 వ పేజీ తరువాయి

సంబంధించిన రెండు పీజీ సీట్లు వస్తాయి. దీనివల్ల రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

టెండర్లు పూర్తి

మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం విమ్స్ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా కొత్తగా ఆరు బ్లాకులు నిర్మిసామని ప్రకటించింది. ఇందుకోసం రూ.250 కోట్లు కేటాయించింది. ఆ పనులు చేపట్టేందుకు అనుగుణంగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. అయితే, తరువాత ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించడంతో అప్‌గ్రేడేష న్‌ను పూర్తిగా పక్కన పెట్టేసింది.

పూర్తిస్థాయిలో సేవలకు..

ప్రస్తుతం విమ్స్‌లో 30కుపైగా విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. వీటిలో పది వరకు సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. అయితే, ఇక్కడ వైద్యులు కాంట్రాక్టు, డిప్యూటేషన్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. అదే అప్‌గ్రేడేషన్ పూర్తయి సూపర్ స్పెషాలిటీ అభివృద్ధి చేస్తే పూర్తిస్థాయి వైద్యులు ఉంటారు. అలాగే, అప్‌గ్రేడేషన్ వల్ల ప్రస్తుతం ఉన్న పడకల సంఖ్య 450 నుంచి 800కు పెరుగుతుంది. శాశ్వత సిబ్బంది నియామకం అవుతారు. ప్రస్తుత ప్రభుత్వమైనాఅప్‌గ్రేడేషన్‌పై దృష్టిసారించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఈ ప్రాంతవాసులు కోరుకుంటున్నారు.

భారీగా రోగులు..

ప్రస్తుతం విమ్స్‌కు ప్రతిరోజూ 800 మంది వరకూ వచ్చి సేవలు పొందుతున్నారు.మరో 200 నుంచి 250 మంది వరకూ ఐపీ (ఇన్ పేషెంట్) సేవలు పొందుతున్నారు. 45 మంది వైద్యులు, 202 మంది స్టాఫ్ నర్సులు, మరో 300 మంది వరకు ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

ఆయిల్ మాఫియా

... 1 వ పేజీ తరువాయి

బంకుల్లో ఆటోమేషన్ సిస్టమ్ పనిచేయకుండా చేశారంటున్నారు. ఏదైనా బంకు డీజిల్ ట్యాంకర్ బుక్ చేసుకుంటే...కంప్యూటర్‌లో అప్పటివరకు ఆ బంకుకు పంపిన డీజిల్, ప్రస్తుతం వారి స్టోరేజీ ట్యాంకులో ఉన్న నిల్వ వివరాలు వస్తాయి. ఆ వివరాలు ఏమీ లేకపోయినా ఆయిల్ కంపెనీ అధికారులు యానాం బంకులకు డీజిల్ ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయంలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు అవసరమైన డీజిల్ ఆనందపురంలో రింగ్ మాస్టర్ లీజుకు తీసుకున్న బంకు నుంచే పంపుతున్నారు.

షిప్‌ల నుంచి కొని కాకినాడకు...

విశాఖపట్నంలో పోర్టులకు వచ్చే నౌకల నుంచి దొంగిలించిన ఆయిల్‌ను మత్స్యకారుల ద్వారా కొనిపించి బార్జీల ద్వారా కాకినాడకు పంపుతున్నారు. అక్కడ జగన్నాథపురం బ్రిడ్జి వద్ద పెద్ద ఆయిల్ స్టోరేజ్ ట్యాంక్ ఉంది. అక్కడి మాఫియా ఈ ఆయిల్ తీసుకొని ఆనందపురం రింగ్ మాస్టర్‌కు కమీషన్లు ఇస్తుంది.

సుమారుగా 20కి పైగా లీజు బంకులు

ఒకప్పుడు బంకులో పెట్రోల్ కొట్టే పనికి చేరిన ఆయన ఇప్పుడు చాలా ఎదిగిపోయారు. అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు విజయవాడ వరకు ఎక్కడ ఏ బంకు మూత పడినా దానిని లీజుకు తీసుకుంటారు. అక్కడి నుంచే దొంగ వ్యాపారం చేస్తారు. అదొక్కటే కాకుండా రాష్ట్రంలో ఎక్కడా కనిపించని హెవీ ట్రాన్స్‌పోర్టు లారీలు (60 టన్నుల కెపాసిటీ) కూడా ఈయనే తిప్పుతున్నారు. ఇలాంటి పెద్ద లారీలు సరకుతో ఏపీలోకి వస్తే అన్‌లోడింగ్ చేసేసి వెళ్లిపోవాలి. కానీ అవి ఇక్కడే తిరుగుతుంటాయి. వాటిని రవాణా శాఖ అధికారులు కూడా పట్టించుకోరు. అవి ఒక్కోసారి ప్రమాదాలకు గురైనా వెంటనే వాటిని విడిచిపెట్టేస్తుంటారు.

కేసులు పెట్టినా బలాదూర్

ఈ వ్యాపారి దందా భరించలేక చాలామంది బంకు యజమానులు వ్యాపారాలు మూసేసుకుంటున్నారు. అంతా కలిసి నేరుగా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఒక కేసులో ఆయన గారి వాహనం పట్టుకొని తూనికలు కొలతల శాఖాధికారులు కేసు పెడితే లక్షల రూపాయాల జరిమానా కట్టారు. ఈ వ్యాపారి దందాపై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

అభివృద్ధి పనులు ప్రారంభం

గోపాలపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 89వ వార్డు పరిధి కొత్తపాలెం గణేశ్ సాయినగర్‌లో రూ.60 లక్షలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపట్టి పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్ వెంకటరమేశ్, నాయకులు బి.విజయ్‌కుమార్, ఎ.కోటేశ్వరరావు, ఎ.గోపి, తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ఘనంగా లైలతుల్ ఖద్ర్ వేడుకలు

గోపాలపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదుల్లో లైలతుల్ ఖద్ర్ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రంజాన్ నెలలో 27వ రోజైన లైలతుల్ ఖద్ర్‌ను పురస్కరించుకుని గోపాలపట్నంలోని తాహా మసీదు, కొత్తపాలెం నూరానియా మసీదు, నందమూరినగర్‌లోని ఉమర్ సుల్తాన్ మసీదుల్లో జరిగిన తరావీ నమాజుల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే సమయంలో మసీదుల్లో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొనడంతో సందడి వాతావరణ నెలకొంది.

50 మంది రక్తదానం

పెందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం పెందుర్తిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వర్యంలో సాయిరామ్ మెడికల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. వారికి దాడి శ్రీను సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మృదుల, ట్రస్టు సభ్యులు ఎస్.గణేశ్, పి.భాను. వినయ్, తేజ నారాయణ, గోపి, సునీత, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కణితిలో పశు వైద్య శిబిరం

కూర్మన్నపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ పరిధి వార్డు కణితిలో గురువారం పశు వైద్యాధికారులు లావణ్య, అప్పలరాజుల ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పశువులు పలు వ్యాధుల బారినపడకుండా ఈ నెల 31 వరకు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పశు పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ఆటోనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ సీఎల్సీ సంస్థ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో గురువారం వంద పేద కుటుంబాలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ బిషప్ మహంతి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పేదలకు, నిరాశ్రయులకు సేవలందిస్తున్నామన్నారు. అలాగే వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు మెర్సీ మహంతి, ఆల్‌ఫ్రెడ్ మహంతి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **పెళ్లికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఛావా**: శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 10, క్యారెట్ 28 దొండకాయలు 24, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)8, అల్లం (పాతది) 50, బరబాటి 22, ముల్లంగి 24, మునక్కాడలు (కిలో) 28, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 56, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 42, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	88
లైవ్ ధర	108
విత్ స్కిన్	186
స్కిన్‌లెస్	196

మురుగు సమస్యతో మూతపడిన వాటర్ ప్లాంట్

- శుద్ధి చేసిన నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న తుంగ్లాం పరిసర ప్రాంతాల ప్రజలు
- వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్లాంటును తెరిపించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని వేడుకోలు


మూతపడిన వాటర్ ప్లాంట్ సమీపంలో మురుగు నీరు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాం కాలనీలో కల్యాణ మండప నిర్మాణ పనులు నిలిచిపోవడంతో దానికి ఆనుకుని ఉన్న వాటర్ ప్లాంట్ మూతపడింది. దీనివల్ల తుంగ్లాం పరిసర ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుంగ్లాం కాలనీలో శిథిలమైన తారకరామ కల్యాణ మండపాన్ని తొలగించి కొత్తగా నిర్మించేందుకు గత ఏడాది ఆగస్టులో శంకుస్థాపన చేశారు. పునాదుల నిమిత్తం భారీ గోతులు తీసి పిల్లర్లు వేసే సమయంలో పలు కారణాల వల్ల కల్యాణ మండపం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కాగా గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు కల్యాణ మండప నిర్మాణం కోసం తవ్విన గోతులు వర్షపు నీటితో నిండిపోయాయి. ఈ నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో మురుగు మారి ఈ ప్రాంతంలో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. కాగా ఈ కల్యాణ మండపానికి ఆనుకుని ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు భూగర్భ జలాలను సేకరించి, దానిని శుద్ధి చేసి స్థానికులకు తక్కువ ధరకు విక్రయించేవారు. కానీ వాటర్ ప్లాంటుకు ఆనుకుని ఉన్న గోతుల్లో మురుగు చేరడం వల్ల ప్లాంటుకు కావాల్సిన మంచినీరు లభించకపోవడంతో దీనిని ఈ ఏడాది జనవరిలో మూసివేశారు. అప్పటినుంచి తుంగ్లాం కాలనీవాసులు మినరల్ వాటర్ కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల తుంగ్లాం విచ్చేసిన జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్ రాజు దృష్టికి స్థానికులు సమస్యను తీసుకువెళ్లారు. వేసవి తీవ్రతను, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు త్వరితంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంటును తెరిపించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడిగా శివ ఏకగ్రీవం

- చింతగట్ల పంచాయతీ ఉప సర్పంచ్‌గా కనకమహాలక్ష్మి ఎన్నిక


శివను అభినందిస్తున్న ఎంపీపీ నాగమణి, పాలకవర్గ సభ్యులు

పెందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడిగా ముదపాక శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కో-ఆప్షన్ సభ్యుడి పదవికి పరోక్ష పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో కూటమి నాయకుల మద్దతుతో శివ ఎన్నికయ్యారు. కో-ఆప్షన్ సభ్యుడి పదవి కోసం తన నామినేషన్ పత్రాన్ని ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేష శైలజకు అందజేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎన్నిక నిర్వహించగా కో-ఆప్షన్ సభ్యుడి పదవికి ఒక నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ముదపాక ఎంపీటీసీ ముదపాక దేవి కో-ఆప్షన్ సభ్యుడిగా శివ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా మండల పరిషత్ అధ్యక్షురాలు మధుపాడ నాగమణి బలపరిచినట్టు శేష శైలజ తెలిపారు. మిగిలిన ఎంపీటీసీ సభ్యులు కూడా తమ అంగీకారం తెలపడంతో శివ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఆమె ప్రకటించారు. అనంతరం శివతో ప్రమాణ పత్రాన్ని చదివించారు. ఈ సందర్భంగా శివను ఎంపీపీ, ఎంపీటీసీలు అభినందించారు.

కూటమి నేతలకు శివ కృతజ్ఞతలు

ఏకగ్రీవంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యుడు ముదపాక శివ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి నేతల మద్దతుతోనే తనకు ఈ పదవి లభించిందంటూ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా వైసీపీకి చెందిన ఎంపీటీసీల అందరి ఆమోదంతోనే కో-ఆప్షన్ సభ్యుడి పదవి ఎన్నిక ఏకగ్రీవమైందని, దీనిని ఇది కూటమి ఘనతగా చెప్పుకోవడం సమర్థనీయం కాదని ఆ పార్టీ నాయకులు చర్చించుకున్నారు. అందుకే ఒక్క నామినేషన్ దాఖలైందని వారంటున్నారు. ఏదిఏమైనా ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఎంపీడీవో కొల్లి వెంకటరావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికకు సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే చింతగట్ల పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా బొట్టా కనకమహాలక్ష్మి అభ్యర్థిత్వాన్ని మెజారిటీ వార్డు సభ్యులు ప్రతిపాదించారు. దీంతో ఆమె ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్టు ఎంపీడీవో వెంకటరావు తెలిపారు.

బిల్లులు అందక విలవిల్లాడుతున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు

- తక్షణమే మంజూరు చేసి ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి

మల్కాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో వివిధ పనులు చేపట్టిన జీవీఎంసీ కాంట్రాక్టర్లకు ఏళ్లు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో విలవిల్లాడుతున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెండర్లు పొందిన పనులను తాము సకాలంలో పూర్తి చేసినప్పటికీ జీవీఎంసీ బిల్లులు చెల్లించకపోవడం ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. ఏళ్లతరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టడం తలకు మించిన భారంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ బిల్లులు మంజూరవ్వక ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యాయత్నం కూడా చేశారు.

అయితే ఈ విషయాన్ని బయటకు పొక్కనివ్వలేదు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లకు సుమారు ఐదారు కోట్ల రూపాయల వరకు బిల్లులు మంజూరు కావాల్సి ఉన్నట్టు తెలిసింది. వారికి బిల్లులు మంజూరు కాకపోవడంతో కొన్ని పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. ఇటీవల పలువురు కాంట్రాక్టర్లు తమకు త్వరితంగా బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలను కూడా అందజేశారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుతో పాటు కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తమకు బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


నిధులు మంజూరవ్వక మధ్యలోనే ఆగిపోయిన నిర్మాణం

ప్రభుత్వ హయాంలో నూర్‌బాషాలకు మేలు

- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ హయాంలో నూర్‌బాషాలకు అంతా మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. చినముషిడివాడలోని మసీద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మైనారిటీల అభ్యున్నతికి, సంక్షేమానికి తాను కట్టుబడి ఉంటానన్నారు. అనంతరం అందరకీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రెసిడెంట్ షేక్ బ్రుహాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, జనసేన నాయకులు పిళ్లా జగన్మోహనపాత్రుడు, ఎస్.సోమశేఖర్, సంఘ సభ్యులు షేక్ నాగూర్, షేక్ రెహమాన్, సైదులు ముయముద్దీన్, రెహమాన్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: పెందుర్తి నియోజకవర్గంలోని ముస్లింల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఇక్కడి మసీద్ ఈ క్యూబా ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. పెందుర్తి, వేపగుంట పరిధిలో అరబిక్ స్కూల్ స్థాపనకు, షాదీఖానా నిర్మాణానికి, తదితర సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంఘం, వేపగుంట మసీద్ గౌరవ అధ్యక్షుడు షేక్ బాబ్జీ, ఇస్మాయిల్, షేక్ షాపూర్, షేక్ షకీర్, షేక్ రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: గ్రేటర్ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్‌లు హాజరయ్యారు. ముందుగా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2014-19 మధ్య మైనారిటీల సంక్షేమం కోసం టీడీపీ అనేక పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. మైనారిటీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, పెంటారావు, ఎం.రాము, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగంలో మాక్ డ్రిల్


మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగంలో గురువారం ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించారు. విభాగంలోని తార్ డిస్టలేషన్ ప్లాంటులో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఏ విధంగా బయటపడాలో మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో కొంతమంది అగ్నిమాపక సిబ్బంది, అధికారులు హుటాహుటిన తార్ డిస్టలేషన్ ప్లాంటు వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఫైర్ అలారం మోగింది. దీంతో ఉద్యోగులకు కాసేపు ఏం జరుగుతుందో అర్థం కాక భయాందోళనకు గురయ్యారు. అయితే ఇదంతా మాక్ డ్రిల్‌లో భాగమని ఉన్నతాధికారులు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో భాగంగా దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే దాని నుంచి ఏ విధంగా బయటపడాలో కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేశ్ మాట్లాడుతూ కంపెనీల్లో ఉద్యోగులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలో తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అడవివరం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు, చెట్లు కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పద్మావతినగర్, షిప్‌యార్డు లేఅవుట్, మైత్రీనగర్, జంగాలకాలనీ, అడవివరం, భైరవవాక పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

తాగునీటి పైపు లైన్‌కు మరమ్మతులు

కూర్మన్నపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్ వద్దనున్న 12ఎంఎల్‌డీ తాగునీటి శుద్ధి కర్మాగారంలో పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను తాగునీటి విభాగం ఈఈ, డీఈ శ్రీనివాసులు, ఏఈ కేదారినాథ్ పరిశీలించి సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మరమ్మతు పనుల కారణంగా 86, 87 వార్డుల ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం వాటిల్లిందన్నారు. శుక్రవారం నుంచి యథావిధిగా నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

జడ్పీ పాఠశాలలో ఇంకుడు గుంత ఏర్పాటు

గోపాలపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటితే భావితరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. జలవనరుల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, అందరూ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

మహా ధర్నాను విజయవంతం చేయండి

- ఏప్రిల్ 1న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహణ
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ ఒకటో తేదీ ఉదయం పది గంటలకు జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నాను నిర్వహిస్తున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం నాటికి దీక్షలు 1,505వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నారని, ఆయనకు ప్రభుత్వం, వివిధ రాజకీయ పార్టీలు కొమ్ముగాయడం దారుణమన్నారు. కేంద్రం ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా ఐక్య పోరాటాలతో తాము తిప్పికొడతామన్నారు. మహా ధర్నాను అన్ని వర్గాల వారు విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, రాజబాబు, జె.రామకృష్ణ, వి.ప్రసాద్, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఉత్సవం రేపు



పెదగంట్యాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నడుపూరులోని శ్రీనూకాంబిక ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేకువజాము 4 గంటల నుంచే అమ్మవారి దర్శనాలు ప్రారంభమవు తాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే 65వ వార్డు అశోక్‌నగర్‌లో శ్రీ నూకాంబిక ఉత్సవాన్ని వైభవంగా జరిపేందుకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వేపగుంట: జీవీఎంసీ 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురంలో శ్రీనూకాంబిక దశమ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. 28న పూజలు, 29న ప్రత్యేక పూజలతో పాటు పురవీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు జరిపాక 108 బిందెల నీటితో అభిషేకం జరపనున్నారు. 30న ఉగాది వేడుకలను జరుపుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విజ్ఞాన్‌లో ఎస్ఆర్ఐసీ సదస్సు

అగనంపూడి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఏఎస్ఎంఈ స్టూడెంట్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే స్టూడెంట్ రీసెర్చ్ ఇండస్ట్రియల్ కాన్‌క్లేవ్ (ఎస్ఆర్ఐసీ) 2025 సదస్సును గురువారం ప్రారంభించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ప్రొఫెసర్ సాలివాహన్ శ్రీవాస్తవ, స్టీల్‌ప్లాంట్ జీఎం ఎంఎస్ కృష్ణమోహన్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పరిశోధనాత్మకమైన యోచనలకు, కొత్త ఆవిష్కరణలకు ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అతిథులు సంతోశ్‌కుమార్ బెహరా, మధుస్మితా మహంతి విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ మాఫియా

... 1వ పేజీ తరువాయి

బంకుల్లో ఆటోమేషన్ సిస్టమ్ పనిచేయకుండా చేశారంటున్నారు. ఏదైనా బంకు డీజిల్ ట్యాంకర్ బుక్ చేసుకుంటే...కంప్యూటర్‌లో అప్పటివరకు ఆ బంకుకు పంపిన డీజిల్, ప్రస్తుతం వారి స్టోరేజీ ట్యాంకులో ఉన్న నిల్వ వివరాలు వస్తాయి. ఆ వివరాలు ఏమీ లేకపోయినా ఆయిల్ కంపెనీ అధికారులు యానాం బంకులకు డీజిల్ ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయంలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు అవసరమైన డీజిల్ ఆనందపురంలో రింగ్ మాస్టర్ లీజుకు తీసుకున్న బంకునుంచే పంపుతున్నారు.

షిప్‌ల నుంచి కొని కాకినాడకు...

విశాఖపట్నంలో పోర్టులకు వచ్చే నౌకల నుంచి దొంగిలించిన ఆయిల్‌ను మత్స్యకారుల ద్వారా కొనిపించి బార్జీల ద్వారా కాకినాడకు పంపుతున్నారు. అక్కడ జగన్నాథపురం బ్రిడ్జి వద్ద పెద్ద ఆయిల్ స్టోరేజ్ ట్యాంక్ ఉంది. అక్కడి మాఫియా ఈ ఆయిల్ తీసుకొని ఆనందపురం రింగ్ మాస్టర్‌కు కమీషన్లు ఇస్తుంది.

సుమారుగా 20కి పైగా లీజు బంకులు

ఒకప్పుడు బంకులో పెట్రోల్ కొట్టే పనికి చేరిన ఆయన ఇప్పుడు చాలా ఎదిగిపోయారు. అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు విజయవాడ వరకు ఎక్కడ ఏ బంకు మూత పడినా దానిని లీజుకు తీసుకుంటారు. అక్కడి నుంచే దొంగ వ్యాపారం చేస్తారు. అదొక్కటే కాకుండా రాష్ట్రంలో ఎక్కడా కనిపించని హెవీ ట్రాన్స్‌పోర్టు లారీలు (60 టన్నుల కెపాసిటీ) కూడా ఈయనే తిప్పుతున్నారు. ఇలాంటి పెద్ద లారీలు సరకుతో ఏపీలోకి వస్తే అన్‌లోడింగ్ చేసేసి వెళ్లిపోవాలి. కానీ అవి ఇక్కడే తిరుగుతుంటాయి. వాటిని రవాణా శాఖ అధికారులు కూడా పట్టించుకోరు. అవి ఒక్కోసారి ప్రమాదాలకు గురైనా వెంటనే వాటిని విడిచిపెట్టేస్తుంటారు.

కేసులు పెట్టినా బలాదూర్

ఈ వ్యాపారి దందా భరించలేక చాలామంది బంకు యజమానులు వ్యాపారాలు మూసేసుకుంటున్నారు. అంతా కలిసి నేరుగా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఒక కేసులో ఆయన గారి వాహనం పట్టుకొని తూనికలు కొలతల శాఖాధికారులు కేసు పెడితే లక్షల రూపాయాల జరిమానా కట్టారు. ఈ వ్యాపారి దందాపై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

అటకెక్కిన విమ్స్ అప్‌గ్రేడేషన్

... 1వ పేజీ తరువాయి

సంబంధించిన రెండు పీజీ సీట్లు వస్తాయి. దీనివల్ల రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

టెండర్లు పూర్తి

మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం విమ్స్ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా కొత్తగా ఆరు బ్లాకులు నిర్మిస్తామని ప్రకటించింది. ఇందుకోసం రూ.250 కోట్లు కేటాయించింది. ఆ పనులు చేపట్టేందుకు అనుగుణంగా టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. అయితే, తరువాత ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించడంతో అప్‌గ్రేడేషన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసింది.

పూర్తిస్థాయిలో సేవలకు..

ప్రస్తుతం విమ్స్‌లో 30కుపైగా విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. వీటిలో పది వరకు సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. అయితే, ఇక్కడ వైద్యులు కాంట్రాక్టు, డిప్యూటేషన్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. అదే అప్‌గ్రేడేషన్ పూర్తయి సూపర్ స్పెషాలిటీ అభివృద్ధి చేస్తే పూర్తిస్థాయి వైద్యులు ఉంటారు. అలాగే, అప్‌గ్రేడేషన్ వల్ల ప్రస్తుతం ఉన్న పడకల సంఖ్య 450 నుంచి 800కు పెరుగుతుంది. శాశ్వత సిబ్బంది నియామకం అవుతారు. ప్రస్తుత ప్రభుత్వమైనా అప్‌గ్రేడేషన్‌పై దృష్టిసారించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఈ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

భారీగా రోగులు..

ప్రస్తుతం విమ్స్‌కు ప్రతిరోజూ 800 మంది వరకూ వచ్చి సేవలు పొందుతున్నారు. మరో 200 నుంచి 250 మంది వరకూ ఐపీ (ఇన్‌పేషెంట్) సేవలు పొందుతున్నారు. 45 మంది వైద్యులు, 202 మంది స్టాఫ్ నర్సులు, మరో 300 మంది వరకు ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉపశమనం

... 1వ పేజీ తరువాయి

వారికి రాయితీలు కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి విద్యాసంస్థలో విద్యుత్ అవసరాల మేరకు సోలార్ ప్రాజెక్టులు నెలకొల్పి, అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకునేలా చూడాలని యోచిస్తున్నారు. ఇది సాకారమైతే విద్యుత్ బిల్లులను ప్రభుత్వం కూడా భరించాల్సిన అవసరం ఉండదు. సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన పెట్టుబడి ఒకసారి పెడితే సరిపోతుంది. అన్ని విద్యా సంస్థల్లో మైదానాలు, పైకప్పులు ఖాళీయే కాబట్టి వాటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని ఈపీడీసీఎల్ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. త్వరలోనే వీటిపై మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉందని వివరించారు.

వార్డుల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిధులు కొరత ఉన్నా.. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలతో చర్చించి నిధులు రాబట్టి వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు ఆధ్వర్యంలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ అభివృద్ధి పనులను ప్రజలు గుర్తిస్తారన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులను శంకుస్థాపనలతో సరిపెట్టకుండా ప్రారంభోత్సవాలు కూడా చేస్తామన్నారు. 97వ వార్డును అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామన్నారు. కాగా సుజాతనగర్, నరవానిపాలెం, పులగాలిపాలెం, దుర్గానగర్ ప్రాంతాల్లో రూ 2.25 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, సేనాపతి శంకరరావు, సేనాపతి సోమశేఖర్, పి.వరలక్ష్మి, ఎ.సింహాచలం, జగన్మోహనపాత్రుడు, జి.అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టీల్ సిటీ ఐటీఐలో అప్రంటీస్ మేళా

గాజువాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రభుత్వ స్టీల్ సిటీ ఐటీఐలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం అప్రంటీస్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్. శ్రీనివాస్ తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడినవారు ఇందులో పాల్గొనవచ్చన్నారు. అప్రంటీస్ సమయంలో రూ.11 వేల వేతనంతో పాటు శిక్షణ పూర్తయ్యాక ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకల్లా ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

వేతన బకాయిలను చెల్లించాలని ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలను చెల్లించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలను సకాలంలో ఇవ్వాలని, టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న వారికి విద్యుత్ చార్జీలను తగ్గించాలని, హెచ్‌ఆర్‌ఏను పునరుద్ధరించాలన్నారు. గడిచిన నాలుగు నెలల కాలంలో రూ.10,200 కోట్ల ఉత్పత్తుల అమ్మకాలు జరిగాయని, కానీ ఉద్యోగుల జీతాలను మాత్రం సకాలంలో ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, అప్పారావు, టీవీకే రాజు, గంగాధర్, వెంకటరమణ, సత్యనారాయణ, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు బంగార్రాజుకు సత్కారం

పెదగంట్యాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల నటుడు, నాటక రచయిత, దర్శకుడు కొత్తపల్లి బంగార్రాజును పారిశ్రామిక ప్రాంత కళాకారులు, టీడీపీ బీసీ సెల్ నాయకులు గురువారం సత్కరించారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా సమతానగర్‌లోని నటాలి సంస్థ కార్యాలయంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ రంగస్థల కళను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కళాకారులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో కళాకారులు టి.శివప్రసాదరావు, పి.వెంకటేశ్వరరావు, బీసీ సెల్ నాయకులు ఎ.కృష్ణ, డి.శ్రీనివాసరాజు, ఎల్.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ


వెంకటరమణ

మురళీనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకాల్లో భాగంగా విశాఖ నగరానికి చెందిన 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణను రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు గురువారం జారీ అయ్యాయి. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా వెంకటరమణ పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి అధిష్ఠానం ఇచ్చిన ఈ బాధ్యతను నెరవేరుస్తూ ఎస్సీ వర్గాల్లో పార్టీ బలోపేతానికి, వారు మరింతగా ఉన్నతి ఎదగడానికి కృషి చేస్తానన్నారు. పార్టీ నగర నాయకులు, వార్డు కార్యకర్తలు, జీవీఎంసీకి చెందిన వైసీపీ కార్పొరేటర్లు, అనుచరులు ఈ సందర్భంగా వెంకటరమణకు శుభాకాంక్షలు తెలిపారు.

చురుగ్గా రేషన్ కార్డుల ఈకేవైసీ


ఈకేవైసీ చేయిస్తున్న టీడీపీ నాయకులు

మర్రిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈనెల 31లోగా ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. గడువు దగ్గర పడుతుండటంతో 54వ వార్డు మర్రిపాలెం మహారాణీవీధిలో 68, 69, 70, 72, 74 డిపోలకు సంబంధించిన ఈకేవైసీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. పెద్దసంఖ్యలో ఆయా డిపోల పరిధిలోని ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోని రేషన్‌కార్డుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. పౌరసరఫరాలశాఖ ఆర్ఐ సతీష్, టీడీపీ నాయకులు కుట్టా కార్తీక్, కొలుసు సత్యారావు, ఉప్పాడ శేఖర్, కోసేటి కనకరాజు, అవనాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

చట్టంపె అవగాహన అవసరం

సీతమ్మధార, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టం కోసం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఒకటో అదనపు న్యాయాధికారి ఎం. వెంకట రమణ తెలిపారు స్థానిక ఎన్ఎంసీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు.

కల్యాణ మండపం గుర్తుందా?

» ఆదాయం కోల్పోతున్నా పట్టించుకోని జీవీఎంసీ » పేదలకు దూరమైన సౌకర్యం
» నక్కవానిపాలెంలో తాళం వేసిన తీరు » మంజూరైన కొత్త భవనం నిర్మించేదెప్పుడో?


నక్కవానిపాలెంలో వృథాగా వదిలేసిన వివేకానంద కల్యాణ మండపం

సీతమ్మధార, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏ చిన్న ఫంక్షన్ హాలు, కల్యాణ మండపం కావాలన్నా రోజుకు రూ.వేలు, లక్షల్లో అద్దె చెల్లించాల్సి వస్తుంది. ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా ఉంటోంది. దీంతో జీవీఎంసీ అజమాయిషీలో ఉండే కల్యాణ మండపాలు, సామాజిక భవనాల వంక పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు చూస్తున్నారు. 24వ వార్డు నక్కవానిపాలెంలో జీవీఎంసీ అజమాయిషీలో ఉండే వివేకానంద కల్యాణ మండపంకొన్నేళ్లుగా వృధాగా ఉంది. కరోనా సమయంలో మూతపడిన దీన్ని తిరిగి తెరవకపోవడంతో అద్దెల రూపంలో జీవీఎంసీ ఆదాయాన్ని కోల్పోతోంది. మరో వంక పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు తక్కువ ఖర్చుతో వేడుకలు జరుపుకొనేందుకు వసతి సౌకర్యం దూరమైంది.

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం పక్కన అప్పటి కార్పొరేటర్ నక్కా రామకృష్ణా రెడ్డి పర్యవేక్షణలో 1987-88లో వివేకానంద కల్యాణ మండపాన్ని జీవీఎంసీ నిర్మించింది. పెద్ద హాలు, రెండు గదులతో సుమారు వెయ్యి మంది భోజనాలు చేసేందుకు వీలుగా ఉండేది. 1990లో దీన్ని వినియోగంలోకి తేవడంతో నక్కవానిపాలెం, గాంధీనగర్, సీతంపేట, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, చైతన్యనగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఈ మండపంలోవివాహాది శుభ కార్యక్రమాలు జరుపుకునేవారు.అద్దె కూడా పేదలు భరించగలిగే రీతిలో ఉండేది. అప్పట్లో రోజుకు రూ.5 వేల అద్దె నిర్ణయించారు. 1995 నాటికి రోజుకు రూ.10 వేలు, 2020 నాటికి రూ.15 వేలుగా పెంచారు. ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడంతో ఏటా జీవీఎంసీకి సుమారు రూ.10 లక్షల ఆదాయం సమకూరేది. కాలక్రమంలో లీజుదారుకు, జీవీఎంసీకి మధ్య వివాదం తలెత్తి కోర్టు వరకు వెళ్లింది. 2019 కరోనా సమయంలో ఈ మండపాన్ని జీవీఎంసీ తమ ఆధీనంలోకి తీసుకుని ఏడు నెలల పాటు యాచకులకు, రోడ్డుపై నివాసం ఉండేవారికి ఇందులో ఆశ్రయం కల్పించింది. అనంతరం కల్యాణ మండపానికి తాళం వేశారు. 2020-21 నుంచి మండపం వృథాగా ఉంది. ఆదాయమార్గం మూసుకుపోయినా జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మండపంలో కొన్ని వస్తువులు అపహరణకు గురయ్యాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. భవనం తలుపులు, తాళాలు విరగ్గొట్టి కల్యాణ మండపంలో మల, మూత్ర విసర్జన చేస్తున్నారు.

నూతన భవనం మంజూరు

మూడు దశాబ్దాల కిందట నిర్మించిన వివేకానంద కల్యాణ మండపాన్ని పడగొట్టి నూతన భవనం నిర్మించడానికి కౌన్సిల్ ఆమోదం పొందిందని, బడ్జెట్ కేటాయించవలసి ఉందని జోన్ 3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. త్వరలోనే నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పార్కింగ్, సెల్లార్, రెండు అంతస్తులతో కొత్త భవనం నిర్మిస్తామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు ప్రారంభం


అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శ్రీలత

అక్కయ్యపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో ఎంవీ రమణి కుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ, శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు సీడీపీవో శ్రీలత హాజరై ప్రసంగించారు. లక్ష్యాలు, బాల్యారంభ సంరక్షణ, విద్య ప్రాధాన్యం, 3 నుంచి 6 ఏళ్ళ పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని సాధించడం, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మూడేళ్ళ పిల్లల వరకు పిల్లల సమగ్రాభివృద్ధి సాధించాలంటే ఏం చేయాలి, ఏ కార్యక్రమాలు ఏ అభివృద్ధికి ఉపయోగపడతాయి టీచింగ్, లెర్నింగ్ ఎయిడ్స్ ప్రాముఖ్యత అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మజారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, వెన్నిషా, సుందరి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏడో అడిషనల్ మేజిస్ట్రేట్ కొమ్మాది అనురాగ్

కంచరపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైనర్లు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పోక్సో చట్టంపై అవగాహన కలిగిఉండాలని ఏడో అడిషనల్ మేజిస్ట్రేట్ కొమ్మాది అనురాగ్ పేర్కొన్నారు. ఆర్పీపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉజ్వల భవిష్యత్‌ను రూపొందించుకోవాలన్నారు. ఈవ్ టీజింగ్, చెడు వ్యసనాలు వంటి వాటి జోలికి పోద్దని కోరారు. మైనర్లు, లైంగిక వేధింపులకు గురి కాకుండా పోక్సో చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. ఎటువంటి న్యాయ సలహాలకైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, వైద్యులు డా.శశిప్రియాంక, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎం.రజిని, లేబర్ అధికారి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కొత్త రాయల్ ఎన్‌ఫీల్డ్ -650 క్లాసిక్ బైక్


బైక్ ఆవిష్కరిస్తున్న సీతారాం మోటార్స్ అధినేత జీవీవీ సీతారామయ్య

దొండపర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాయల్ ఎన్‌ఫీల్డ్-650 క్లాసిక్ మోడల్ బైక్‌ను దొండపర్తిలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌లో సీతారాం మోటార్స్ అధినేత జీవీవీ సీతారామయ్య గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బైక్ యువతకు తగ్గట్టుగా సరికొత్తగా, సహజ సిద్ధమైన శక్తివంతమైన ఇంజన్‌తో సిటీ డ్రైవ్‌కు అనుకూలంగా రూపొందించారన్నారు క్రోమ్ బ్లాక్ బైక్ ధర రూ 3.50 లక్షలు ఎక్స్ షోరూమ్ ధరగా పేర్కొన్నారు. నగరంలోని గురుద్వార్, మద్దిలపాలెం, ఎంవీ కాలనీ, దొండపర్తిలో బ్రాంచ్‌లో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సీతారాం మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ సీతారాం, జి.నరేంద్ర చౌదరి, ఏరియా సేల్స్ మేనేజర్ జె.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో పనిచేయనున్న రిజిస్ట్రార్ కార్యాలయాలు

... 1వ పేజీ తరువాయి

11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తాయని వెల్లడించింది. అయితే రిజిస్ట్రేషన్‌కు అవసరమైన చలానాలు చెల్లించడానికి బ్యాంకులు కూడా అవసరం కాబట్టి, ఎస్‌బీఐకి ఈ మేరకు లేఖ రాసినట్టు, వారు కూడా ఆ రోజున కొన్ని శాఖలను తెరిచి ఉంచుతారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే ఈ రెండు సెలవు రోజుల్లో పనిచేసిన ఉద్యోగులకు వేరే రోజుల్లో సెలవు తీసుకునే అవకాశం కల్పించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. విశాఖపట్నం జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ మార్చి నెల ఆదాయ లక్ష్యం రూ.136 కోట్లు కాగా 27వ తేదీ నాటికి రూ.79 కోట్లు వచ్చిందని, ఈ నాలుగు రోజుల్లో మరింత వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

విద్యార్థులకు తగ్గనున్న మోతబరువు

... 1వ పేజీ తరువాయి

సన్నాహాలు చేస్తున్నారు. ఏటా మే నెలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తుంటారు. అయితే కొత్త ప్రభుత్వం ఈ ప్రక్రియను మార్చి నుంచే ప్రారంభించింది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఉన్న 46 మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ఏడాది సుమారు 38 లక్షలకు పైబడి పుస్తకాలు అవసరమవుతాయని అధికారులు లెక్కించారు. ప్రస్తుతం వివిధ తరగతులకు సంబంధించి 3,99,153 పుస్తకాలు గాజువాకలోని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల విక్రయ కేంద్రానికి చేరుకున్నాయి. దఫదఫాలుగా ఏప్రిల్ నెలాఖరులోగా మొత్తం పుస్తకాలు డిపోకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రియల్టర్ల మాయాజాలం

... 1వ పేజీ తరువాయి

వరకూ రహదారి నిర్మాణం చేపట్టేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు సిద్ధమయ్యారు. ఐదారు రోజుల నుంచి రెండు ప్రొక్లెయినర్లతో పనులు చేపట్టడంతో వ్యవహారం బయటకు వచ్చింది.

రహదారి నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో ప్రభుత్వ భూమితో పాటు పర్యాటక శాఖకు చెందిన స్థలం ఉన్నాయి. కానీ మండల తహసీల్దార్ నుంచి గానీ, పర్యాటక శాఖ నుంచి గానీ అనుమతి తీసుకోలేదు. అలాగే కొంతమేర జిరాయితీ భూములు కూడా ఉన్నాయి. బెదిరించడంతో రైతులంతా మౌనంగా ఉండిపోయారు.

ప్రస్తుతం రహదారి నిర్మాణం కోసం 70 నుంచి 80 అడుగుల వెడల్పున కొండ, దానికి ఆనుకుని భూమిని తవ్వేశారు. కొండను తవ్వేటప్పుడు గనుల శాఖ అనుమతి తీసుకోలేదు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలి. కానీ, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు ఎటువంటి వర్క్ ఆర్డర్ ఇవ్వలేదు. రోడ్ నిర్మాణంతో తమకు సంబంధం లేదని అధికారులు స్పష్టంచేశారు. కాగా అనుమతి లేకుండా ప్రభుత్వ, పర్యాటక శాఖ భూమి గుండా రోడ్డు నిర్మించడాన్ని రెవెన్యూ శాఖ తీవ్రంగా పరిగణించింది. భీమిలి ఆర్డీవో సంగీతమాధుర్, ఆనందపురం తహసీల్దార్ శ్యాంప్రసాద్ రోడ్డును పరిశీలించి యంత్రాలను సీజ్ చేశారు. రహదారి నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దారు స్పష్టంచేశారు. ఈ విషయమై మామిడిలోవ సర్పంచ్ మల్లికార్జునరావును ప్రశ్నించగా 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టామన్నారు. ఇంజనీరింగ్ శాఖ నుంచి అనుమతులు త్వరలో తీసుకుంటామని, గ్రామస్థుల కోసమే రహదారి నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు.

1 నుంచి సదరం స్లాట్స్

... 1వ పేజీ తరువాయి

పొందేందుకు అవకాశం ఉంటుంది. ఈ సదరం స్లాట్లను మీసేవ, గ్రామ/వార్డు సచివాలయాల్లో బుక్ చేసుకోవచ్చు. ఆ తరువాత సదరు వ్యక్తి ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్ రూపంలో వివరాలు వస్తాయి. సదరు స్లాట్‌లో కేటాయించిన ఆస్పత్రికి అందులో పేర్కొన్న తేదీ, సమయానికి వెళ్లి వైద్యులకు చూపించుకోవాల్సి ఉంటుంది. సద రు వైద్యులు వైకల్యాన్ని నిర్ధారించి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. సదరం సర్టిఫికెట్లను శారీరక, మానసిక వైకల్యం ఉన్న వారికి, కంటిచూపు లోపం ఉన్న వారికి కేటాయిస్తారు.

రాయగడ, విజయనగరం సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని రాయగడ, విజయనగరం సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా గురువారం తనిఖీలు చేశారు. ఈ సెక్షన్‌లో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, కమర్షియల్, ఆపరేటింగ్ శాఖలకు చెందిన పలు విభాగాల పనితీరును పరిశీలించారు. అలాగే వివిధ స్టేషన్లలో ప్రయాణికుల మౌలిక సదుపాయాల నిర్వహణ, స్టేషన్ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. బొబ్బిలి, పార్వతీపురం స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. అలాగే నిర్మాణ దశలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్క్యులేటింగ్ ఏరియా పనులను పరిశీలించారు. కాగా రాయగడ స్టేషన్‌లో వాల్తేరు రైల్వే డీఆర్ఎంతోపాటు రాయగడ డివిజన్ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ కలిసి అక్కడి ఆర్ఆర్ఐ క్యాబిన్, పానెల్ బోర్డులు, వెయిటింగ్ హాల్స్, రిటైరింగ్ రూమ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను తనిఖీ చేశారు. ఈ పర్యటనలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వేలో హిందీ భాష అమలుపై సమావేశం

» విశాఖ వాణి' హిందీ పత్రికను ఆవిష్కరించిన డీఆర్ఎం



విశాఖ వాణి హిందీ పత్రికను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లో అధికార భాష హిందీ అమలుపై గురువారం కమిటీ సమావేశం జరిగింది. డీఆర్ఎం హాల్లో రాజభాష విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాజభాష అమలుకు సంబంధించి వార్షిక కార్యక్రమాలతోపాటు చేపడుతున్న చర్యలపై చర్చించారు. అనంతరం 'విశాఖ వాణి' హిందీ పత్రికను డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పత్రికలో నైపుణ్యాలకు సంబంధించిన అంశాలతో కథనాలుంటాయని పేర్కొన్నారు. హిందీ భాష అమలులలో భాగంగా ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం, వ్యాస రచన పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, రాజభాష అధికారి సంతోష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణ

» విచారణాధికారిగా తుమ్మపాల సుగర్స్ ఎండీ

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)లో అనేక అవకతవకలు బయటపడిన నేపథ్యంలో సహకార శాఖ 51 విచారణకు ఆదేశించింది. ఈపీడీసీఎల్ నుంచి తక్కువ రేటుకు విద్యుత్ కొని దానిని మూడు రెట్లు ఎక్కువకు విక్రయించి లాభాలు పొందుతున్న ఆర్ఈసీఎస్ ఆ నిధులను పక్కదారి పట్టించింది. ఉద్యోగులు, ఉన్నతాధికారులు అంతా కలిసి కోట్లాది రూపాయలు స్వాహా చేశారని ఫిర్యాదులు అందడంతో సొసైటీని స్థానిక డిస్కమ్‌కు అప్పగించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశించింది. దాంతో ఆర్ఈసీఎస్‌ను గత రెండేళ్లుగా ఈపీడీసీఎల్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తప్పులు బయటపడడంతో ఎండీని తప్పించారు. అయితే పూర్తిస్థాయి విచారణ ఇప్పటికీ నిర్వహించలేదు. బాధ్యులను గుర్తించలేదు. దీనిపై స్థానిక నాయకులు ఫిర్యాదు చేయడంతో సహకార శాఖ కమిషనర్ 51 విచారణకు ఆదేశించారు. ఇలాంటి సమయాల్లో విచారణ అధికారిని వారే నిర్ణయిస్తారు. కానీ ఈ కేసులో ఎందుకో ఆ బాధ్యత జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)కే అప్పగించారు. దాంతో ఇక్కడి డీసీఓ ప్రేమస్వరూప విచారణాధికారిగా తుమ్మపాల సుగర్స్ ఎండీ ఎంవీఎస్ శాస్త్రిని నియమించారు. నిధులు దుర్వినియోగంపై లోతైన విచారణ చేస్తే తప్ప వాస్తవాలు బయటకు రావనే వాదన వినిపిస్తోంది.

'ముస్లింలను అన్ని విధాలా ఆదుకుంటాం'


మంత్రి లోకేశ్‌తో మహ్మద్ నజీర్

మహారాణిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలను అన్ని విధాలా ఆదుకుంటామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. గురువారం ఆయన లోకేశ్‌ను ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ముస్లింల సంక్షేమానికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు.మంత్రి లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ముఖ్యంగా భవిష్యత్తులో ముస్లింల సంక్షేమానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకోనున్నట్టు తెలియజేశారని నజీర్ తెలిపారు,

కనకమహాలక్ష్మి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు

మహారాణిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో హుండీల లెక్కింపు గురువారం చేపట్టారు. గత నెల 12 నుంచి ఈనెల 27 వరకు ఈ లెక్కింపు జరిగింది. రూ. 30,67,190 లక్షల నగదు, 84 అమెరికా డాలర్లు, 50 ఇంగ్లాండు పౌండ్లు, 50 సౌత్ ఆఫ్రికా నగదు లభించగా, బంగారం 32.100 గ్రాములు, వెండి 590 గ్రాములు వచ్చినట్టు ఆలయ ఈఓ కె. శోభారాణి తెలిపారు, అలాగే అంబికాబాగ్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం హుండీల లెక్కింపు ద్వారా రూ. 2,94 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

శాస్త్రీయ సంగీతంపై ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : డాబాగార్డెన్స్‌లోని ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కమిటీ ఆధ్వర్యంలో ఏడాది పాటు శాస్త్రీయ సంగీతం, అన్నమాచార్య సంకీర్తనలు, పురందర దాసు సంకీర్తనలు, వేణుగానంపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ కార్యదర్శి పి. జగన్‌మోహన్‌రావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల నుంచి 50 ఏళ్ల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, స్త్రీ, పురుషులు ఎవరైనా కుల మతాలకు అతీతంగా శిక్షణ తీసుకోవచ్చునని చెప్పారు. నగరానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆకొండి వెంకటరావు శాస్త్రీయ సంగీతంపై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 6వ తేదీలోగా రాఘవేంద్రస్వామి ఆలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 63026 61211, 83092 20060 సెల్ నంబర్లను సంప్రతించాలని సూచించారు.

హిందీపై కొనసాగుతున్న జాతీయ సదస్సు

జ్ఞానాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఎనిమిది రోజులుగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, కేంద్రీయ హిందీ నిదేశాలయం సౌజన్యంతో జరుగుతున్న హిందీ నవ రచయితల జాతీయ సదస్సు గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా కోల్హాపూర్ మహావీర్ మహా విద్యాలయం ప్రొఫెసర్ డా..సుష్మా చౌగలే మాట్లాడుతూ హిందీ వ్యవహారికంగాను, వృత్తిపరంగా, ఉద్యోగ అవకాశాలకు ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డా. షైజీ, డాక్టర్ పీకే జయలక్ష్మి, డాక్టర్ రాజేంద్ర రౌటే, డా. ఎస్. దీప్తి, డా. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో విజ్ఞానం

మహారాణిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజూ భగవద్గీత చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుం దని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అర్జున్ జీ అన్నారు. గురువారం ఆయన జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న ఆధ్యా త్మిక సమావేశ మందిరంలో తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవద్గీత మనిషి జీవితానికి మార్గ దర్శకం అన్నారు. అందులో జీవితానికి సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు సమాధానం లభిస్తుందని చెప్పారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

అల్లిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురంలోని నేరెళ్ల కోనేరు ప్రాంతానికి రాజారావు అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు, వార్డు కార్పొరేటర్ కం దుల నాగరాజు గురువారం ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, నీలబాబు, రవి, తదితరులు పాల్గొన్నారు.

రాజసం ఉట్టిపడేలా కలెక్టరేట్ ముఖద్వారం


నాలుగు సింహాలతో నిర్మాణంలో ఉన్న ఆర్చ్

మహారాణిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌కు మరో మణిహారంగా నాలుగు సింహాల రాజ ముద్రతో ప్రవేశ ద్వారం (ఆర్చ్) నిర్మాణం రూపుదిద్దుకుంటోంది. విశాలమైన ప్రాంగణంలో అలనాటి బ్రిటిష్ వారి రాతి కట్టడంతో రాజ ప్రసాదాన్ని తలపించేలా ఉండే కలెక్టరేట్‌లో మరో చూడముచ్చటైన కట్టడాన్ని నిర్మిస్తున్నారు. సుమారు రూ.60 లక్షల వ్యయంతో కలెక్టరేట్ గేటు నిర్మిస్తున్నారు. అందమైన రాతి కట్టడంతో సుమారు 12 అడుగులు ఉండే రాకపోకలకు వేర్వేరు ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ ద్వారంపై రాజసం ఉట్టిపడేలా సత్యానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచే నాలుగు సింహాలతో కూడిన రాజముద్రను ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారం నుంచి చూస్తే రాజ భవనాన్ని తలపిస్తుంది. కలెక్టరేట్ ప్రాంగణంలో అనేక కార్యాలయాలు ఉన్నాయి. వివిధ పనులపై వచ్చే ప్రజలకు నిర్మాణం పూర్తి చేసుకుంటున్న ప్రవేశ ద్వారం మంచి అనుభూతిని ఇస్తుందనటంలో ఎటువంటి సంశయం లేదు. పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఎటువంటి ఆటంకాలు లేకుంటే ఉగాది రోజున ఆర్చిని ప్రారంభించే అవకాశం ఉంది.

విద్యార్థులపై తల్లిదండ్రులు మరింత దృష్టి పెట్టాలి


ఉపాధ్యాయులతో సర్వశిక్షాభియాన్ ఏపీసీ చంద్రశేఖరరావు

డాబాగార్డెన్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల చదువు గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం చాలా ముఖ్యమని, దీనివల్ల వారు ఏ స్థాయిలో చదువుతున్నారో తెలుస్తుందని విశాఖపట్నం ఏపీసీ, ఎస్ఎస్ఏ డా.జె.చంద్రశేఖరరావు సూచించారు. గురువారం ఆయన డాబాగార్డెన్స్‌లోని రమాదేవి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో మరింత అభివృద్ధి చెందేందుకు బేస్ లైన్, మిడ్ లైన్ ఎడ్ లైన్ అన్న క్యాన్సెప్ట్‌తో తెలుసుకుంటున్నామని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని సూచించారు. కేటగిరీ వారీగా విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివిపించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన అడిగిన ప్రశ్నలకు సమానాధాలు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హెచ్ ప్రభాకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పలు పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడా మండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృశింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున సిరి సంపెంగలతో అర్చనలు చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

సరస్వతీ పార్కులోకి ప్రవేశం ఎలా ?

సందర్శకులు రాకుండా ఒకవైపు కర్రలతో మూసివేత


సందర్శకులు వెళ్లడానికి వీల్లేకుండా ఒక వైపు మూసి ఉన్న ద్వారం

డాబాగార్డెన్స్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీ పార్కు స్థానికులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తుంది. పార్కు నిర్వహణ ఎలా ఉన్నా- అసలు లోపలకు స్వేచ్ఛగా ప్రవేశించే అవకాశం లేకుండా కొన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇక్కడ ఫ్లెక్సీలు, కటౌట్ల కోసమే పెద్ద పెద్ద కర్రలు పెట్టి ఒకవైపు మార్గాన్ని మూసివేశారు. దీంతో చిన్నారులు, వృద్ధులు పార్కులోకి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పలువురు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంద ర్శకులు పార్కులోకి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న కర్రలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాఖలీగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటలవరకు పోలింగ్ ఉంటుంది. ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎన్నికల సంఘం అధ్యక్షుడు జీఎం రెడ్డి తెలిపారు. మొత్తం 2,958 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వివిధ పదవులకు సంబంధించి ఆరు రంగుల బ్యాలెట్‌లను సిద్ధం చేశారు. ఓటువేసిన తరువాత ఏ రంగు బ్యాలెట్ ఆరంగు బాక్సులో వేయాల్సి ఉంటుంది. పార్కింగ్‌కు సంబంధించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన న్యాయవాదులకు సూచించారు. ఆరు పోలింగ్ బూత్‌లలో ఒక్కో బూత్‌లో ఒకే సారి ఐదుగురు ఓటు వేసే అవకాశం ఉంది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

30న అప్పన్న ఆలయంలో ఉడుపోత్సవం

సింహాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలకు ఈనెల 30న శ్రీకారం చుట్టనున్నారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు సింహగిరిపై పందిరిరాట ఉడుపు ఉత్సవం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. అదేరోజు ఉగాది సందర్భంగా ఉదయం విశేష అర్చనల అనంతరం ఉగాది పచ్చడి నివేదిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఆస్థానమండపంలో పంచాంగ పఠనం, 4.30 గంటలకు సింహగిరిపై మూడుప్రాంతాల్లో పందిరిరాట ఉడుపు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరుపుతారు. అనంతరం పండిత సత్కారం, దాతలకు సేవా పురస్కారాలు అందిస్తారు. అప్పన్న సన్నిధిలోనికి సూర్యభాగవానుడి కిరణాల ప్రవేశం, పిదప స్వామికి తిరువీధి నిర్వహించనున్నారు.

డైట్ లెక్చరర్లకు మూడేళ్ల డిప్యూటేషన్ కాలపరిమితి

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో డిప్యూటేషన్‌పై పనిచేసే లెక్చరర్ల నియామకంపై పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్కూలు అసిస్టెంట్/ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న టీచర్లు డిప్యూటేషన్‌పై డైట్‌లో బోధిస్తున్నారు. మూడేళ్లకు మించి పనిచేసే వారంతా వెనక్కి వెళ్లాలని, వారి స్థానంలో అర్హులైన టీచర్లకు రాత, మౌఖిక పరీక్ష నిర్వహించి వచ్చే నెల 15లోగా నియమించాలని ఆదేశించింది.

కొనసాగిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్రాక్టీస్

నేడు నగరానికి రానున్న ఎస్ఆర్‌హెచ్ ఆటగాళ్లు

విశాఖపట్నం, స్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు ముమ్మర సాధనలో నిమగ్నమయ్యారు. తొలి మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో విజయం సాధించిన ఈ జట్టు ఈనెల 30న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌లో తలపడనుంది. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం నుంచి కెప్టెన్ అక్షర పటేల్, అశుతోష్ శర్మ, మిచెల్ స్టార్క్, డుప్లెసిస్, సమీర్ రజ్వీ, విపరాజ్ నిగమ్, పూరన్, కరుణ్ నాయర్, కులదీప్ యాదవ్, ముకేష్‌కుమార్, త్రిపూర్ణ విజయ్, మోహిత్ శర్మ, మెక్‌గుర్క్, అభిషేక్ పోరెల్ నెట్‌ప్రాక్టీసులో పాల్గొన్నారు. కాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు శుక్రవారం సాయంత్రం విశాఖ విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. శనివారం నెట్ ప్రాక్టీసులో పాల్గొనే అవకాశాలున్నాయి.


కెప్టెన్ అక్షర్ పటేల్, మిచెల్ స్టార్క్ రన్నింగ్ ప్రాక్టీస్


జట్టు సభ్యులతో మాట్లాడుతున్న కెప్టెన్ అక్షరపటేల్


రిషబ్‌పంత్, డూప్లెసెస్ సమాలోచనలు


డుప్లెసిస్, అభిషేక్ పోరల్ బ్యాటింగ్ ప్రాక్టీస్

సంక్షేమమే లక్ష్యంగా మైనారిటీలకు ప్రత్యేక పథకాలు

- ప్రభుత్వ ఇఫ్తార్ విందులో కలెక్టర్, సీపీ

సిరిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పండుగ అనేది ఏ మతానికి సంబంధించినదైనా దాని వెనుకున్న సందేశం సమాజంలోని ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమవుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రభుత్వ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మైనారిటీల అభివృద్ధికి రూ.6 కోట్లు కేటాయించి, సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసి, అధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తుల అక్రమ కబ్జాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ముస్లిం సోదరులందరూ రంజాన్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని పండగలు మన చరిత్రను, మంచిని తెలియజేస్తాయన్నారు. ఇఫ్తార్‌విందులో కలెక్టర్, పోలీస్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్, ఇతర ముస్లిం సోదరులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు

గాజా మారణహోమాన్ని తక్షణం ఆపాలి



సంఘీభావ కార్యక్రమంలో పౌర, ప్రజా సంఘాల నాయకులు

సిరిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో పాలస్తీనాపై ఇజ్రాయల్ సాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం పౌర, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఉన్న యుద్ధ నియమ, నిబంధనలు ఉల్లంఘించి గాజాలోని ఆస్పత్రులు, చిన్న పిల్లలు, మహిళలపై అత్యంత పాశవికంగా బాంబులతో దాడులు చేయడం దుర్మార్గమన్నారు. పౌర సమాజం పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిలబడాలని, పాలస్తీనా భూభాగంలోని ఇజ్రాయల్ సేలను వెంటనే వెనక్కి రప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా,పౌర సంఘాల నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, వీఎస్ కృష్ణ, ఎం.లక్ష్మి, కె.లలిత, ఎం.మన్మథరావు, రెహమాన్, నాగభూషణరావు, కొడ వజ్రం, రామ్‌ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చకుంటే 1 నుంచి సమ్మె

ప్రభుత్వానికి విద్యుత్ మీటర్ రీడర్ల హెచ్చరిక


ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

సీతమ్మధార, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బాల కాశీ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల విద్యుత్ మీటర్ రీడర్స్ గురుద్వారలోని ఈపీడీసీఎల్ జోనల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చి, విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ప్రభుత్వం అదానీ, అంబానీలకు కొమ్ము కాస్తోందన్నారు. హామీలు నెరవేర్చకుంటే ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీఎండీకి డిమాండ్ల పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, విద్యుత్ మీటర్ల రాష్ట్ర సంఘ నాయకులు రామకృష్ణ, శివారెడ్డి, క్రాంతికుమార్, రెహమాన్, మన్మథరావు, రామలింగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శీనివాస్ శేఖర్, చిరంజీవి పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో మెగా జాబ్‌మేళా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్ అర్షద్, తదితరులు

డాబాగార్డెన్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28, 29 తేదీల్లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సీఈవో, కార్యదర్శి ఇంతియాజ్ అర్షద్ తెలిపారు. మేళాకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రైస్ సంస్థ సీఈఓ వంశీకృష్ణ మాట్లాడుతూ ట్రయాజ్, బీఎన్‌సీ సంస్థలు నిర్వహించే మేళాకు ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా హాజరుకావచ్చునన్నారు. మధురవాడ మిథిలాపురి వుడాకాలనీ ఫ్యాబ్ ఇండియా భవనంలో మేళా నిర్వహిస్తారన్నారు. విజయవాడ, నెల్లూరు, హైదరాబాద్ నగరాల్లో పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారు హాజరుకావచ్చునన్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉచిత రవాణా, సబ్సిడీపై హాస్టల్, భోజనం తదితర సదుపాయాలుంటాయన్నారు. వివరాలకు 92924 58992, 86887 97804 నంబర్లలో సంప్రతించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ కేఆర్ కిరణ్‌కుమార్, ఎన్‌టీవీఎస్ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ఎం.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

లులూకు భూ కేటాయింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులోని హార్బర్‌పార్క్ భూమిని లులూ సంస్థకు 99 ఏళ్ల లీజుపై కేటాయించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.1500 కోట్లు విలువ చేసే 13.43 ఎకరాల భూమిని అప్పనంగా ప్రైవేటు సంస్థకు అప్పగించడం దారుణమన్నారు. 2019లో అదే భూమిని లులూకు కేటాయించగా, వైసీపీ రద్దుచేసిందన్నారు. తిరిగి అదే భూమిని కేటాయించాలని నిర్ణయించడం వల్ల నగరానికి నష్టంతోపాటు పర్యావరణానికి హాని జరుగుతుందన్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకుల ఆహ్లాదానికి విఘాతం కలగడంతోపాటు అనేక చిన్నసంస్థలు దెబ్బతిని వేలాదిమంది ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. లులూ సంస్థకు జీఎస్టీ మినహాయింపు, అందులో పనిచేసే ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.7,500 చొప్పున పీఎఫ్ చెల్లింపు వంటి రాయితీలు ఇవ్వడం సరికాదన్నారు.

రూ.29.37 కోట్లు గ్యాస్ సబ్సిడీ జమ

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పథకం ద్వారా 99 శాతానికి మించి బియ్యంకార్డుదారులు లబ్ధి పొందారు. ఇప్పటివరకు జిల్లాలో 3.7 లక్షలమంది సబ్సిడీని వినియోగించుకోవడంతో వారి ఖాతాలకు గురువారం వరకు రూ.29.37 కోట్లు సొమ్ము జమయింది. జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డులుండగా వారిలో గ్యాస్ సబ్సిడీకి 3.77 లక్షలమంది అర్హులు. ఇంకా మిగిలిన వారికి రెండుమూడు రోజుల్లో రాయితీ నిధులు జమ కానున్నాయి. తొలివిడత సబ్సిడీ గడువు నెలాఖరుతో ముగుస్తుందని ఇన్‌చార్జి డీఎస్వో కల్యాణి తెలిపారు. రెండోవిడత ఏప్రిల్ ఒకటోతేదీ నుంచి జూలై 31 వరకు వినియోగించుకోవచ్చునన్నారు.

ఏప్రిల్‌లోనూ కంది పప్పు సరఫరా లేదు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల సంస్థ మరోసారి నిరాశ పర్చింది. ఏప్రిల్‌కు సంబంధించి కందిపప్పు సరఫరా చేయలేదు. బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తారు. ఈ ఏడాది జనవరిలో కందిపప్పు పంపిణీచేసిన సంస్థ ఫిబ్రవరి నుంచి నిలిపివేసింది. మిల్లర్ల నుంచి కందిపప్పు సక్రమంగా సరఫరా కానందున బియ్యంకార్డుదారులకు పంపిణీకి ఇబ్బందులు ఉన్నాయని రేషన్ డీలర్లకు సంబంధిత అధికారులు వెల్లడించారు.

టెర్రరిస్టు దాడులపై అప్రమత్తంగా ఉండాలి: డీఆర్వో


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో భవనీశంకర్

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనూహ్యరీతిలో జరిగే టెర్రరిస్టు దాడులపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉంటూ దీటుగా ఎదుర్కోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద తగిన ప్రమాణాలతో భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.టెర్రరిజం, అగ్నిప్రమాదాల నుంచి ప్రజలను అప్రమత్తం చేసేలా ఆటోమేటిక్ అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆక్టోపస్ సేవలపై సమీక్షలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ఆక్టోపస్ సేవలను అభినందించారు. విపత్తుల సమయంలో వ్యవహరించే తీరు, స్పందన, తీసుకునే చర్యలను అందరూ తెలుసుకోవాలన్నారు. ఫైర్‌సర్వీస్, విద్యుత్, వైద్యఆరోగ్య, పోలీస్, రెవెన్యూశాఖలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆక్టోపస్ ఆపరేషన్స్ రాష్ట్ర అధికారి జగ్గునాయుడు, ఇన్‌చార్జి అధికారి మధుసూదనరావు సంస్థ సేవలను వివరించారు. రాష్ట్రంలోని తిరుపతి, గన్నవరం కేంద్రాలుగా రెండు ఆపరేషన్ యూనిట్లు సేవలందిస్తున్నాయని, మూడో యూనిట్ విశాఖలో ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, అగ్నిమాపకశాఖ ఏడీఎఫ్ఓ సింహాచలం, వైద్యఆరోగ్యశాఖ సర్వైలెన్స్ అధికారి ప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి


సతీష్ మృతదేహం

సాగర్‌నగర్, మార్చి27(ఆంధ్రజ్యోతి): రుషికొండ స్వర్ణభారతినగర్‌లో బహుళ అంతస్థుల భవనం పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం వెలుగుచూసింది. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లికి చెందిన తవిడబోయిన సతీష్ (35) భవన నిర్మాణాల్లో గ్రానైట్ పనులు చేస్తుంటాడు. ఈనెల 23న మరో పదిమందితో కలిసి రుషికొండలోని ఓ ప్రైవేటు విద్యాలయంలో గ్రానైట్ పనులు చేసేందుకు వచ్చాడు. వీరంతా రుషికొండ స్వర్ణభారతినగర్‌లోని ఓ భవనం నాల్గో అంతస్థులో ఫ్లాట్ అద్దెకు తీసుకుని వుంటున్నారు. బుధవారం రాత్రి వారు గదిబయట బాల్కనీలో మద్యం సేవించారు. సతీష్‌కు రేచీకటి ఉండడంతో మద్యం మత్తులో రాత్రి 12 గంటల సమయంలో పిట్టగోడ వద్దకు వెళ్లి అకస్మాత్తుగా కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పీఎంపాలెం ఎస్ఐ కె.భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భవతి మృతిపై బంధువుల ఆందోళన


లక్ష్మి (ఫైల్ ఫొటో)

రామ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లుగా పిల్లలు లేని దంపతులు ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రతించారు. మందులు వాడడంతో ఆమె గర్భవతి అయింది. కవలపిల్లలు పుడతారనే ఆనందంలో ఉండగా తీవ్ర అనారోగ్యానికి గురయింది. కడుపులోనే పసికందులు మృతిచెందగా, కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆమె కూడా మృతిచెందింది. దీంతో బంధువులు ఫెర్టిలిటీ వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంనకు చెందిన గెంజి లక్ష్మికి ఎనిమిదేళ్ల కిందట వివాహమయింది. పిల్లలు లేకపోవడంతో నగరంలోని రామ్‌నగర్ వద్ద గల ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రతించారు. చికిత్స కోసం సుమారు రూ.10 లక్షలకు అంగీకరించి, కొంత మొత్తం చెల్లించారు. ఈక్రమంలో లక్ష్మి గర్భం దాల్చింది. ఆమె కడుపనులో కవల పిల్లలున్నారని వైద్యులు తెలిపారు. కాగా ఈనెల 24న ఆమె తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఫెర్టిలిటీ సెంటర్‌కు తీసుకు వచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆమె గర్భంలో కవలలు మృతిచెందినట్టు గుర్తించారు. అంతేకాకుండా లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని, కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. కేజీహెచ్ వైద్యులు ఆమెకు శస్త్రచికిత్స చేసి, గర్భంలో మృతిచెందిన కవలలను బయటకు తీశారు. అనంతరం చికిత్స అందిస్తుండగా గురువారం లక్ష్మికూడా మృతిచెందింది. దీంతో ఫెర్టిలిటీ సెంటర్ వైద్యుల నిర్లక్ష్యంతోనే లక్ష్మి మృతిచెందిందని ఆమె బంధువులు కేంద్రం ఎదుట ఆందోళన చేశారు.

భవనం పైనుంచి దూకేస్తానని మహిళ హల్‌చల్


సన్‌షైడ్‌పై ఉన్న మహిళను రక్షించేందుకు యత్నిస్తున్న పోలీసులు

కొమ్మాది, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి సన్‌షైడ్ మీదకు ఎక్కి దూకేస్తానంటూ ఓ మహిళ హల్‌చల్ చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానిక వైఎస్ఆర్ కాలనీ బ్లాక్ నంబరు 24లో బబ్బిన వెంకటరమణ, భార్య సూరి, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం తనకు రూ.500 కావాలని వెంకటరమణను భార్య అడిగింది. లేవని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఉదయం 11.30 గంటలకు వారు మూడో అంతస్థు కిటీ సన్‌సైడ్‌కు చేరుకుని కిందకు దూకేస్తానంటూ బెదిరించింది. చాలా సేపు అక్కడే ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పీఎంపాలెం ఎస్ఐ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకుని ఆమె కూర్చున్న బ్లాక్ పైఅంతస్థుకు వెళ్లి, మాటలతో నచ్చచెబుతూ చాకచక్యంగా పైకి లాగారు. నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు, సీఐ బాలకృష్ణ ఎస్ఐను అభినందించారు. అనంతరం పోలీసులు దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

నేటి నుంచి అనకాపల్లి నూకాలమ్మ ఉత్సవాలు


నూకాంబిక అమ్మవారు


ఆలయం ఎదుట విద్యుత్ దీపాల సెట్టింగ్

అనకాపల్లి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర వాసుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించడంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా ఫాల్గుణ బహుళ అమావాస్య (అంటే ఉగాది ముందు రోజు) నుంచి చైత్ర బహుళ అమావాస్య వరకు నెల రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృషితో రాష్ట్ర పండగగా మారడంతో అందుకు తగిన సౌకర్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.